E KABURU - Digital News Paper E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

హైదరాబాద్ (తేదీ) 26-02-2026 (వారం) గురువారం సంపుటి: 02 || సంచిక:56|| పేజీలు–6 www.ekaburu.com



7 నగరాల్లో 'రైల్ పార్సిల్' యాప్ సేవలు ....(2లో)

## పసిగుడ్డు ఏం పాపం చేసింది?

## బాధితులతో కలిసి కేటీఆర్ ధర్నా


- నాగర్‌కర్నూల్‌లో పర్యటించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్
- కుమ్మెర జాతర ఘటనలో మృతి చెందిన పసిపాప కుటుంబానికి పరామర్శ
- బాధిత కుటుంబానికి సంఘీభావంగా కేటీఆర్ నిరసన దీక్ష
- కాంగ్రెస్ నేతల దాడి వల్లే పసిపాప మృతి చెందిందని ఆరోపణ
- బాధితులపైనే పోలీసులు కేసు పెట్టారని ఆగ్రహం



ఈ కబురు ; నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర మల్లన్న జాతరలో జరిగిన దాడి ఘటనలో హంతకులను కాపాడే ప్రయత్నం చేయడం సిగ్గుచేటని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. కుమ్మెర జాతరలో జరిగిన ఘటన మాటలకు అందని విషాదం అని చెప్పారు. రెండు నెలల పసిగుడ్డు ఏం పాపం చేసిందని దుర్మార్గంగా ప్రవర్తించారని మండిపడ్డారు. శిశువు మరణిస్తే కూడా హత్యకేసు పెట్టకపోవడమేంటని ప్రశ్నించారు. హంతకులను కాపాడాలనుకునే ప్రతిఒక్కరూ దోషులేనని, ఇందులో సీఎం, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ ఎవరున్నా దోషులేనని అన్నారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం ఆయన మాట్లాడారు.

....(మిగతా2లో)

# ఉగ్రవాదానికి భారత్ వ్యతిరేకం



- దానిపై పోరులో రాజీ లేదు: మోదీ
- భారత్, ఇజ్రాయెల్‌ది ఒకే వైఖరి
- ఆ దేశానికి దన్నుగా నిలుస్తాం
- గాజా శాంతి చర్చలకు మద్దతు

ఉగ్రవాదాన్ని అన్ని రూపాల్లోనూ సమూలంగా అంతం చేయడమే భారత్ లక్ష్యం. ఈ విషయంలో భారత్, ఇజ్రాయెల్‌ది ఒకే వైఖరి. ఎవరేమన్నా, ఎన్ని చెప్పినా ఉగ్రవాదం ఏవిధంగానూ సమర్థనీయం కాదు. ఈ విషయంలో మరో మాటకు తావు లేదు. ఇజ్రాయెలీలపై హమాస్ పాల్పడ్డ ఆటవిక దాడి తాలూకు బాధను భారతీయులందరమూ అనుభవించాం. ఇజ్రాయెలీ సోదరుల అంతులేని ఆవేదనను మేమంతా పంచుకున్నాం.

ఎందుకంటే ఉగ్రవాదం తాలూకు నొప్పిని భారత్ చాలాకాలంగా అనుభవిస్తూ వస్తోంది. రక్షణ, వ్యవసాయ, వాణిజ్య తదితర రంగాల్లో ఇరుదేశాల భాగస్వామ్యం ముమ్ముందు మరింత బలోపేతం చేసుకుంటాం. అంతేగాక భారత్, ఇజ్రాయెల్, యూఏఈ, అమెరికాలతో కూడిన 'మిడిల్ ఈస్ట్ యూరప్ ఎకనామిక్ కారిడార్', 'ఐ2యూ2 ఫ్రేమ్‌వర్క్'ల్లో కూడా మరింత చురుగ్గా భాగస్వాములం అవుతాం.

– ప్రధాని నరేంద్ర మోదీ





ఈకబురు, జెరూసలెం: ఉగ్రవాదం ఏ మూలన, ఏ రూపంలో ఉన్నా ప్రపంచమంతటికీ అది పెను ముప్పేనని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ''ఉగ్రవాదంపై పోరులో రాజీ పడే ప్రసక్తే లేదు. దాన్ని అన్ని రూపాల్లోనూ సమూలంగా అంతం చేయడమే భారత లక్ష్యం. ఈ విషయంలో భారత్, ఇజ్రాయెల్‌లది ఒకే వైఖరి'' అని స్పష్టం చేశారు. ఇజ్రాయెల్ పర్యటనలో భాగంగా ఆయన బుధవారం ఆ దేశ పార్లమెంటు కెనెసెట్‌లో ప్రసంగించారు. కెనెసెట్ సభ్యులంతా గౌరవ సూచకంగా లేచి నిలబడి మరీ మోదీని స్వాగతించారు. 'మోదీ', 'మోదీ' అంటూ నినాదాలతో హోరెత్తించారు. అనంతరం ప్రధాని మాట్లాడుతూ, ''ఉగ్రవాదం సమాజాలనే అస్థిరపరుస్తుంది. అభివృద్ధికి విఘాతంగా మారుతుంది. విశ్వాసాన్ని రూపుమాపుతుంది. అలాంటి ఉన్మాద భూతంపై పోరులో ద్వంద్వ ప్రమాణాలు పనికిరావు. దాన్ని రూపుమాపాలంటే ప్రపంచ స్థాయిలో పూర్తి సమన్వయంతో కూడిన ప్రయత్నాలు తప్పనిసరి'' అని కుండబద్దలు కొట్టారు.

....(మిగతా2లో)



2

రెవెన్యూ వ్యవస్థను ఆధునీకీకరించి.. వేగవంతమైన సేవలు అందిస్తాం: పొంగులేటి

ఈ కబురు, హైదరాబాద్: ప్రజలకు మరింత సౌకర్యవంతమైన, పారదర్శక పరిపాలన అందించాలనే లక్ష్యంతో తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని



2

సిఎం రేవంత్ రెడ్డితో శంతను నారాయణ్ సమావేశం

- ఉద్యోగాలపై ఏఐ, నైపుణ్యాభివృద్ధి, కొత్త అవకాశాలపై చర్చ
- ప్రభుత్వపరంగా ఏం చేయాలనే అంశాలపై వారి మధ్య చర్చ
- రాష్ట్రాన్ని తయారీ కేంద్రంగా నిలబెట్టడానికి చర్యలు తీసుకోవాల్సి ఉందన్న సీఎం

## సుంకాలపై 'సుప్రీం' తీర్పు దురదృష్టకరం: ట్రంప్



....2లో

## బాసర ట్రిబుల్‌ఐటీలో ఇంజినీరింగ్ విద్యార్థిని ఆత్మహత్య

....3లో





## ఉగాది కానుకగా ఇందిరమ్మ ఇళ్లు

## హైదరాబాద్ వాసుల కోసం సర్కార్ ప్రత్యేక ప్రణాళిక

- గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుకు ఏర్పాట్లు
- ఉగాదిలోగా లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందించాలని లక్ష్యం
- సొంత స్థలం ఉన్న పేదలకు ఇల్లు కట్టుకునేందుకు రూ.5 లక్షల ఆర్థిక సాయం
- మురికివాడల్లో మోడల్ కాలనీల నిర్మాణం.. 28 వేల డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీకి ప్లాన్
- రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 3 లక్షల ఇళ్లు మంజూరు చేసిన ప్రభుత్వం

....(మిగతా2లో)





ఈ కబురు, హైదరాబాద్ ;

హైదరాబాద్ నగరంలోని నిరుపేదలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం శుభవార్త అందించింది. రాష్ట్రవ్యాప్తంగా అమలవుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిలోనూ ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఉగాది పండగలోపు అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలు అందజేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

## సుప్రీంకోర్టులో మల్లారెడ్డికి దక్కని ఊరట

- మాజీ మంత్రి మల్లారెడ్డి పిటిషన్‌ను తోసిపుచ్చిన సుప్రీంకోర్టు
- హైకోర్టు ఆదేశాల్లో జోక్యం చేసుకోలేమని స్పష్టీకరణ
- సర్వే ప్రక్రియ పూర్తయినందున జోక్యానికి నిరాకరణ



ఈ కబురు ; సుప్రీంకోర్టులో తెలంగాణ మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత మల్లారెడ్డి, ఆయన కుమారుడు మహేందర్ రెడ్డి, అల్లుడు మర్రి రాజశేఖర్ రెడ్డిలకు చుక్కెదురైంది. జీడిమెట్ల భూ సర్వేకు సంబంధించి తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకోవడానికి సుప్రీం కోర్టు అంగీకరించలేదు. మేడ్చల్‌మల్కాజ్‌గిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలంలోని జీడిమెట్ల సర్వే నం. 82/1/ఈఈలో గల 0.33 గుంటల భూమికి హద్దులు నిర్ణయించాలని కోరుతూ శేరి శ్రీనివాస్ రెడ్డి అనే వ్యక్తి తొలుత హైకోర్టును ఆశ్రయించారు.

....(మిగతా3లో)

## న్యాయవ్యవస్థ ప్రతిష్ఠకు భంగం

- NCERT పాఠంపై సుప్రీంకోర్టు సీరియస్



ఈ కబురు : నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (NCERT) 8వ తరగతి పాఠ్యాంశంలో న్యాయవ్యవస్థలో అవినీతి అంశాన్ని ప్రవేశపెట్టడంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది. '' ఈ వ్యవహారం అందరినీ కలవరానికి గురిచేసింది.

....(మిగతా2లో)

## ఏపిలో సాగునీటి ప్రాజెక్టులకు బ్లూప్రింట్

- ఈ ఏడాది జూలైకి వెలిగొండ తొలిదశ పూర్తి చేసి నీళ్లు
- మార్కాపురం జిల్లాతో దశాబ్దాల కల సాకారం.. రూ.50 కోట్లతో కలక్టరేట్
- జిల్లా ఏర్పడ్డాక తొలిసారి వెళ్లిన ముఖ్యమంత్రికి అపూర్వ స్వాగతం
- గత పాలకులు ప్రాజెక్టు పూర్తి కాకుండానే జాతికి అంకితమిచ్చేశారు
- వెలిగొండపై వైసీపీ డ్రామాలను ఎండగట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- రూ.456 కోట్లతో వెలిగొండ ఫీడర్ కెనాల్ పనులకు సీఎం శంకుస్థాపన
- మార్కాపురం జిల్లా కళ, వెలిగొండ కళకళ బహిరంగ సభా వేదికలో సీఎం



ఈ కబురు, అమరావతి :

ఈ ఏడాది జూలై నాటికి వెలిగొండ తొలిదశ పూర్తిచేసి మార్కాపురం జిల్లాలోని ప్రతి ఎకరాకు సాగు నీరందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. గత పాలకుడిలా ప్రాజెక్టు పూర్తి కాకుండానే జాతికి అంకితమంటూ రిబ్బన్ కటింగ్లు చేసి దొంగ నాటకాలు ఆడటం తమకు చేతకాదని సీఎం వ్యాఖ్యానించారు. వెనుకబాటుకు గురైన మార్కాపురం ప్రాంతాన్ని కొత్త జిల్లాగా ఏర్పాటు చేస్తామన్న హామీని నిలబెట్టుకున్నామని సీఎం అన్నారు.

....(మిగతా3లో)

## పేరులో అక్షరం తేడా.. 45 ఏళ్లుగా నో పెన్షన్

ఈ కబురు : తండ్రి మరణం తర్వాత వచ్చే పింఛను కోసం ఓ మహిళ నాలుగు దశాబ్దాలకుపైగా పోరాటం చేస్తున్నారు. పేరులో ఒక్క అక్షరం తేడా ఉందనే కారణంతో పింఛను ఇచ్చేందుకు అధికారులు నిరాకరిస్తున్నారు. దీంతో ఆమె అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించారు. సంబంధిత పిటిషన్‌పై విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం.. అధికారుల తీరుపై మండిపడింది. సమస్య పరిష్కారానికి వారంలోగా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.



....(మిగతా2లో)

## పసిగుడ్డు ఏం పాపం చేసింది?

# బాధితులతో కలిసి కేటీఆర్ ధర్నా



**మానవత్వానికే మచ్చ..**
కుమ్మెరలో నిరుపేద కుటుంబంపై దాడి ఘటన మానవత్వానికే మచ్చగా కేటీఆర్ అభివర్ణించారు. ఈ ఘటనను రాజకీయం చేసేందుకు తాము రాలేదని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని అడిగే బాధ్యత ప్రజలందరిపై ఉందని స్పష్టం చేశారు. మల్లన్న దర్శనం కావాలని అడిగినందుకు ఒక వ్యక్తిపై 20 మంది దాడిచేయడం అధికార అహంకారమేనని చెప్పారు. విచక్షణ లేకుండా ఒకడు కాలితో తన్నితే రెండు నెలల పాప చనిపోయిందని తెలిపారు. ఈ కేసును పోలీసులు సుమోటోగా తీసుకోవాల్సింది పోయి.. ఫిర్యాదు ఇస్తే సరిగా రాసివ్వలేదని ఇబ్బంది పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాప తల్లి న్యాయం కోసం రోడ్డెక్కే పరిస్థితి రావడం దారుణమైన విషయం అన్నారు.

8 మందిపై హత్య కేసు నమోదు చేయాలి

పసిపాపకు కులం, మతం, అధికారం గురించి ఏం తెలుసని కేటీఆర్ ప్రశ్నించారు. ఈ ఘటన గురించి తెలిశాక ఒక తండ్రిగా తల్లడిల్లిపోయానని ఆవేదన చెందారు. 8 మందిపై హత్యకేసు నమోదు చేసి జైలుకు పంపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే శిక్షపడే దాకా ఉద్యమం ఆపబోమని, అసెంబ్లీలో నిలదీస్తామన్నారు. బాధిత కుటుంబానికి రూ.కోటి పరి హారం చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ తరపున రూ.లక్ష చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు. ఇంటి నిర్మాణం కోసం రూ.10 లక్షల ఆర్థిక సాయం చేస్తున్నట్టు తెలిపారు. కేటీఆర్ వెంట ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, నిరంజన్‌రెడి ఉన్నారు.

## సిఎం రేవంత్ రెడ్డితో

# శంతను నారాయణ్ సమావేశం



ఈ కబురు ; అడోబ్ సీఈవో, తెలంగాణ రైజింగ్ 2047 విజన్ బోర్డు సభ్యుడు శంతను నారాయణ్ హైదరాబాద్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. ఉద్యోగాలపై ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రభావం, నైపుణ్యాభివృద్ధి, తెలంగాణను తయారీ కేంద్రంగా మార్చడం, గ్లోబల్ ట్రెండ్స్, గ్రీన్ ఎనర్జీ, కొత్త అవకాశాలు వంటి అంశాలపై వారు చర్చించారు. ప్రభుత్వపరంగా ఏం చేయాలనే అంశాలపై కూడా వారి మధ్య చర్చ జరిగింది. కృత్రిమ మేధను సమర్థవంతంగా వినియోగించుకునే అంశంపై శంతను నారాయణ్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్చించారు. తెలంగాణను తయారీ కేంద్రంగా నిలబెట్టడానికి కీలక కంపెనీలను ఆకర్షించడానికి కొన్ని చర్యలు తీసుకోవాల్సి ఉందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు.

## ఉగాది కానుకగా ఇందిరమ్మ ఇళ్లు

## .. హైదరాబాద్ వాసుల కోసం సర్కార్ ప్రత్యేక ప్రణాళిక



--సొంత స్థలం ఉన్నవారికి తొలి ప్రాధాన్యం
ప్రస్తుతం సొంత స్థలం ఉండి కూడా ఆర్థిక ఇబ్బందుల వల్ల ఇల్లు నిర్మించుకోలేని పేదలకు తొలి విడతలో ప్రాధాన్యం ఇవ్వనున్నారు. వీరికి ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందిస్తుంది. గ్రేటర్ పరిధిలో సుమారు 12 లక్షల మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోగా, ప్రాథమిక పరిశీలనలో 18 వేల మందిని అర్హులుగా అధికారులు గుర్తించారు. అయితే, ఈ జాబితాను మరోసారి క్షుణ్ణంగా పరిశీలించి, వారం రోజుల్లో తుది జాబితాను సిద్ధం చేయాలని భావిస్తున్నారు. ఆదాయ పరిమితి, భూ యాజమాన్య పత్రాలు, కుటుంబ పరిస్థితులు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు.

--బహుళ ప్రణాళికలతో ముందుకు
మురికివాడల్లో నివసించే వారి కోసం "ఇందిరమ్మ మోడల్ కాలనీలు" నిర్మించాలని ప్రభుత్వం యోచిస్తోంది. నగరానికి దూరంగా ఇళ్లు కేటాయిస్తే వారి జీవనోపాధి దెబ్బతింటుందనే ఉద్దేశంతో, వారు నివసిస్తున్న ప్రాంతాల్లోనే 5 నుంచి 10 అంతస్తుల భవనాలు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనికి అవసరమైన స్థల సేకరణపై మంత్రులు ఇటీవల అధికారులతో చర్చించారు. వీటితో పాటు, నగరంలో ఇప్పటికే సిద్ధంగా ఉన్న 28 వేల డబుల్ బెడ్‌రూం ఇళ్లను కూడా పేదలకు కేటాయించాలని నిర్ణయించారు. గృహలక్ష్మి పథకం లబ్ధిదారులకు కూడా ఈ పథకాన్ని వర్తింపజేయనున్నారు.

--రాష్ట్రవ్యాప్తంగా జోరుగా పనులు
ఇదిలా ఉండగా, తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు వేగంగా సాగుతోంది. ప్రభుత్వం ఇప్పటివరకు 3 లక్షల ఇళ్లను మంజూరు చేయగా, వారిలో 2.50 లక్షల మంది లబ్ధిదారులు నిర్మాణ పనులను ప్రారంభించారు. వచ్చే నెలాఖరు నాటికి లక్ష ఇళ్లను పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

# ఉగ్రవాదానికి భారత్ వ్యతిరేకం



చిరకాల మిత్ర దేశమైన ఇజ్రాయెల్‌కు భారత్ ఈ విషయంలో పూర్తిగా దన్నుగా నిలుస్తుందని ప్రకటించారు. గాజా శాంతి చర్చలు పశ్చిమాసియా అంతటా సుస్థిర, చిరకాల శాంతికి బాటలు పరుస్తాయని ఆయన ఆశాభావం వెలిబుచ్చారు. ఐరాస ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ప్రయత్నాలు పాలస్తీనా సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తాయన్న నమ్మకం తనకుందన్నారు. ''శాంతిమార్గం అంత సులువైనది కాదు. అయితే సదుద్దేశంతో కూడిన ప్రయత్నాలకు తెలివిడి, ధైర్యం, మానవత్వం తోడైతే విజయం సునిశ్చితం'' అని పేర్కొన్నారు.

పశ్చిమాసియాలో శాంతి కోసం కొన్నేళ్ల క్రితం ఇజ్రాయెల్ 'అబ్రహం అకార్డ్స్'పై సంతకం చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రధాని గుర్తు చేశారు. ''ఇజ్రాయెల్ చేపట్టిన ఆ చర్య దశాబ్దాల పాటు అట్టుడికిన పశ్చిమాసియాలో కొత్త ఆశలకు నాంది పలికింది. నాటినుంచి ఈ ప్రాంతంలో పరిస్థితులు అనూహ్యంగా మెరుగుపడ్డాయి'' అంటూ హర్షం వెలిబుచ్చారు. ఇజ్రాయెల్ ధైర్య సాహసాలు, దశాబ్దాలుగా ఆ దేశం సాధిస్తున్న ఘన విజయాలంటే భారత్‌లో అందరికీ గొప్ప ఆరాధనా భావముందని చెప్పారు. ఇరుదేశాల నడుమ 2,000 ఏళ్లకు పైగా సన్నిహిత బంధాలున్నాయని గుర్తు చేశారు.

**హమాస్ దాడితో మేమూ ఆక్రోశించాం**
2023 అక్టోబర్ 7న హమాస్ ఉగ్ర సంస్థ జరిపిన పాశవిక దాడిలో భారీ సంఖ్యలో ఇజ్రాయెలీలు ప్రాణాలు కోల్పోవడం భారతీయులందరినీ కలచివేసిందని ప్రధాని అన్నారు. ''వారి కుటుంబీకులకు తనతో పాటు భారతీయులందరి తరఫునా ఈ సందర్భంగా ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నా. ఎవరేమన్నా, ఎన్ని చెప్పినా ఉగ్రవాదం ఏ విధంగానూ సమర్థనీయం కాదు. ఈ విషయంలో మరో మాటకు తావు లేదు. ఇజ్రాయెలీలపై హమాస్ పాల్పడ్డ ఆటవిక దాడి తాలూకు బాధను భారతీయులందరమూ అనుభవించాం.

ఇజ్రాయెలీ సోదరులు అంతులేని ఆవేదనను మేమంతా పంచుకున్నాం. ఎందుకంటే ఉగ్రవాద తాలూకు నొప్పిని భారత్ చాలాకాలంగా అనుభవిస్తూ వస్తోంది. ముంబై ఉగ్ర దాడుల్లో భారతీయులతో పాటు పలువురు ఇజ్రాయెలీ సోదరులు కూడా నిష్కారణంగా ప్రాణాలు కోల్పోయారు. ఈ బాధాకర క్షణాల్లోనూ, ఇకముందు కూడా ఇజ్రాయెల్‌కు భారత్ అన్ని విషయాల్లోనూ పూర్తి స్థాయిలో అండగా, వెన్నుదన్నుగా నిలుస్తుంది'' అని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో పాటు సభ్యుల హర్షధ్వానాల నడుమ మోదీ ప్రకటించారు. ''ఆర్థిక, సాంకేతిక రంగాల్లో భారత్ అపార ప్రగతి సాధిస్తోంది. ఇన్నొవేషన్లు, టెక్నాలజీ నాయకత్వ రంగాల్లో ఇజ్రాయెల్‌కు తిరుగు లేదు. కనుక పలు రంగాల్లో ఇరుదేశాల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకుంటాం. త్వరలో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకుంటాం'' అని వెల్లడించారు. భారత్, ఇజ్రాయెల్, యూఏఈ, అమెరికాలతో కూడిన ''మిడిల్ ఈస్ట్ యూరప్ ఎకనామిక్ కారిడార్', 'ఐ2యూ2 ఫ్రేమ్‌వర్క్'ల్లో కూడా మరింత చురుగ్గా భాగస్వాములం అవుతామన్నారు.

**రెడ్‌కార్పెట్ స్వాగతం**
అంతకుముందు ప్రధాని మోదీకి ఇజ్రాయెల్‌లో రెడ్‌కార్పెట్‌తో ఘనస్వాగతం లభించింది. టెల్ అవీవ్‌లోని బెన్ గురియన్ విమానాశ్రయంలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు తన భార్యతో కలిసి మోదీకి స్వయంగా స్వాగతం పలకడం విశేషం. 'ప్రియమైన మిత్రునికి స్వాగతం' అంటూ మోదీని ఆయన ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. భారత ప్రధానికి స్వాగతం పలకడాన్ని గొప్ప గౌరవంగా భావిస్తున్నట్టు చెప్పారు. ఆయనతో తనకు వ్యక్తిగతంగా కూడా అతి సన్నిహిత బంధముందని అనంతరం ఎక్స్ పోస్టులో నెతన్యాహు గుర్తు చేసుకున్నారు.

తనకు లభించిన ఘనస్వాగతం పట్ల మోదీ హర్షం వెలిబుచ్చారు. అనంతరం విమానాశ్రయంలోనే నేతలిద్దరూ భేటీ అయ్యారు. ద్వైపాక్షిక సంబంధాలతో పాటు పశ్చిమాసియాలో తాజా పరిస్థితులు తదితరాలపై లోతుగా చర్చించారు. నెతన్యాహుతో భేటీ అద్భుతంగా సాగిందని మోదీ పేర్కొన్నారు. వ్యవసాయం, టెక్నాలజీ, నీటి నిర్వహణతో పాటు పలు అంశాల్లో పరస్పర సహకారాన్ని మరింతగా పెంపొందించుకోవాలని నిర్ణయించుకున్నట్టు వెల్లడించారు. గురువారం వారిద్దరూ మరో దఫా భేటీ కానున్నారు. ఆ సందర్భంగా పలు కీలక ఒప్పందాలపై సంతకాలు జరిగే అవకాశముంది. గత తొమ్మిదేళ్లలో ఇజ్రాయెల్‌లో మోదీకి ఇది రెండో పర్యటన.

**మోదీకి అత్యున్నత పురస్కారం**
ప్రధాని మోదీకి ఇజ్రాయెల్ అత్యున్నత పురస్కారం 'స్పీకర్ ఆఫ్ ద కెనెసెట్ మెడల్' దక్కింది. ఆ దేశ పార్లమెంటు 'కెనెసెట్' అందజేసే ఈ అత్యున్నత పురస్కారాన్ని అందుకున్న తొలి భారత ప్రధాని ఆయనే. కెనెసెట్ స్పీకర్ అమీర్ ఒహానా మోదీకి ఆ మెడల్‌ను ప్రదానం చేశారు. ఇరుదేశాల మధ్య సంబంధాల బలోపేతానికి చేస్తున్న కృషికి గుర్తింపుగా ఆయనకు ఈ పురస్కారం అందజేసినట్టు పేర్కొన్నారు. 2018లో పాలస్తీనా కూడా మోదీకి తమ అత్యున్నత పౌర పురస్కారం 'గ్రాండ్‌కాలర్ ఆఫ్ ద స్టేట్ ఆఫ్ పాలస్తైన్' అందజేసింది. ఆ రెండు శత్రు దేశాల నుంచీ అత్యున్నత పురస్కారాలు అందుకుతున్న అరుదైన నాయకునిగా మోదీ నిలిచారు. ఇజ్రాయెల్ పార్లమెంటులో ప్రసంగించిన తొలి భారత ప్రధాని కూడా ఆయనే.

**'మోదీ హగ్' ప్రపంచ ప్రసిద్ధం!**
కెనెసెట్‌లో మోదీని ఆహ్వానిస్తూ ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు స్వాగతోపన్యాసం చేశారు. 'మోదీ నా మిత్రుడు మాత్రమే కాదు, ప్రియమైన సోదరుడు కూడా' అంటూ ప్రశంసల వర్షం కురిపించారు. ''ప్రపంచ వేదిక లపై మోదీ గొప్ప నేతగా వెలుగుతున్నారన్నారు. ముఖ్యంగా 'మోదీ కౌగిలి' చాలా ప్రత్యేకమైనది. అది ప్రపంచమంతటా ప్రసిద్ధి చెందింది'' అంటూ చమత్కరించారు! ''ఇజ్రా యెల్‌లో మోదీ గత పర్యటన సందర్భంగా ఇద్దరమూ మధ్యధరా సముద్ర తీరంలో విహరించాం. చెప్పు లు విడిచి నీళ్లలో నడుద్దామా అని మోదీని అడిగాను. మేమిద్దరం నీళ్లలో నడవలేదు గానీ ద్వైపాక్షిక సంబంధాల విషయంలో అద్భుతాలు చేస్తూ వస్తున్నాం. వర్తకాన్ని రెండింతలు, సహకారాన్ని మూడింతలు, అవగాహ నను నాలుగింతలు పెంచాం'' అన్నారు.
- నెతన్యాహు

## సుంకాలపై 'సుప్రీం' తీర్పు దురదృష్టకరం: ట్రంప్



ఈ కబురు : అమెరికా గతంలో కన్నా బలంగా, మెరుగ్గా, సుసంపన్నంగా మారిందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. 'స్టేట్ ఆఫ్ ది యూనియన్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశ ఆర్థికవ్యవస్థ మునుపెన్నడూ లేనివిధంగా పరుగులు పెడుతోందని తెలిపారు. రానున్న రోజుల్లో దేశాన్ని మరింత మెరుగుపరుస్తామన్నారు. అమెరికాకు ఇది స్వర్ణయుగం అని ట్రంప్ వ్యాఖ్యానించారు. మూడోసారి కూడా అధ్యక్షుడు కావాలన్న ఆశను ట్రంప్ ఇక్కడ ప్రస్తావించారు. రెండోదఫా అధ్యక్ష బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయ్యిందన్నారు. కానీ, ఇది తనకు మూడో దఫా కావాల్సిఉందని వ్యాఖ్యానించారు. ఎన్నో వింతలు జరిగాయంటూ.. 2020 అధ్యక్ష ఎన్నికల గురించి ప్రస్తావించారు. నాటి అధ్యక్ష ఎన్నికల్లో డెమోక్రటిక్ అభ్యర్థి జో బైడెన్ చేతిలో ట్రంప్ ఓడిపోయారు. అమెరికా రాజ్యాంగంలోని 22వ సవరణ ప్రకారం.. ఒకరు రెండుసార్లు మాత్రమే అధ్యక్ష బాధ్యతలు చేపట్టగలరు. ట్రంప్ గతంలో కూడా మూడోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టడం గురించి మాట్లాడారు. గత ప్రభుత్వం నాలుగేళ్లలో అమెరికాలో 1 ట్రిలియన్ డాలర్ల కంటే తక్కువ పెట్టుబడులు తీసుకొస్తే.. ఒక్క సంవత్సరంలోనే తన కార్యవర్గం 18 ట్రిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులు సాధించినట్లు తెలిపారు. అక్రమ వలసలను, ప్రాణాంతక ఫెంటనిల్‌లను సమర్థవంతంగా అడ్డుకున్నామన్నారు. వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురో నిర్బంధం తర్వాత.. ఆ దేశం నుంచి 80 మిలియన్ బ్యారెళ్లకు పైగా చమురు అమెరికాకు వచ్చినట్లు వెల్లడించారు.

# 7 నగరాల్లో 'రైల్ పార్శిల్' యాప్



**ఈ కబురు, సికింద్రాబాద్ :**
రైల్ పార్సిల్ యాప్‌ను దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ఆవిష్కరించారు. మొత్తం 7 నగరాల్లో దీని ద్వారా సేవలు అందించనున్నారు. హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, విశాఖ, రాజమహేంద్రవరం, బెంగళూరు, చెన్నైలో ఈ సేవలు ఉంటాయి. 3 లాజిస్టిక్ పార్ట్‌నర్స్‌తో డోర్ డెలివరీ, మిడిల్ డెలివరీ, మెయిన్ డెలివరీ చేస్తారు. రైల్ పార్సిల్ యాప్‌తో సులువుగా, వేగంగా సేవలు అందుతాయని సంజయ్ కుమార్ శ్రీవాస్తవ అన్నారు.

**––పెన్షనర్లకు రైల్వే శాఖ హెచ్చరికలు**
పెన్షనర్లకు రైల్వే శాఖ హెచ్చరికలు జారీ చేసింది. సైబర్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపింది. రైల్వే పెన్షనర్లు.. స్కామర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరింది. ఏ రైల్వే అధికారి కూడా సోషల్ మీడియా, కాల్స్ ద్వారా గోప్య సమాచారాన్ని అడగరని స్పష్టం చేసింది. అనుమానాస్పద కాల్స్, సందేశాలను వెంటనే పోలీసు సైబర్ సెల్, సంబంధిత అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయానికి నివేదించాలని పెన్షనర్లకు సూచించింది.

## పేరులో అక్షరం తేడా..

# 45 ఏళ్లుగా నో పెన్షన్

ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాన్పూర్‌కు చెందిన మంజు రాయ్ తండ్రి స్థానిక మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేశారు. 1975లో పదవీ విరమణ చేశారు. 1980లో మృతి చెందగా.. అప్పటివరకు పింఛన్ సరిగ్గానే వచ్చేది. అనంతరం ఫ్యామిలీ పెన్షన్ కోసం కుటుంబ సభ్యులు దరఖాస్తు చేసుకోగా.. ఆయన పేరులో అక్షరం తేడా ఉందనే కారణంతో నిరాకరించారు. సర్వీసు రికార్డుల్లో ఆయన పేరు శిఖర్ నాథ్ శుక్లా (Shikhar Nath Shukla)గా నమోదై ఉండగా.. దరఖాస్తు, ఇతర పత్రాల్లో శేఖర్ నాథ్ శుక్లా (Shekhar Nath Shukla)గా ఉంది. 'I', 'E' తేడాతో ఫ్యామిలీ పెన్షన్ మంజూరు కావడం లేదు. 45 ఏళ్లుగా సమస్య అలాగే కొనసాగుతోంది. దీంతో మంజు రాయ్.. అలహాబాద్ హైకోర్టులో పిటిషన్ వేశారు. పేరులో ఒక్క అక్షరమే తేడా ఉందని, దీనిపై అఫిడవిట్ కూడా సమర్పించినట్లు పేర్కొన్నారు. వారసత్వ ధ్రువీకరణ పత్రం, ఇతర పత్రాలను కూడా జతచేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు.. వారం రోజుల్లోగా సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించింది. లేనిపక్షంలో తదుపరి విచారణకు మున్సిపల్ కమిషనర్ స్వయంగా హాజరు కావాల్సి ఉంటుందని హెచ్చరించింది.

# రెవెన్యూ వ్యవస్థను ఆధునికీకరించి..

## వేగవంతమైన సేవలు అందిస్తాం: పొంగులేటి



రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మొదటి దశలో.. అద్దె భవనాల్లో కొనసాగుతున్న 60 తహసీల్దార్ కార్యాలయాలు, 5 ఆర్డీవో కార్యాలయాలకు ఆధునిక సౌకర్యాలతో శాశ్వత భవనాలు నిర్మిస్తామని వెల్లడించారు. రెండో విడతలో.. శిథిలావస్థలో ఉన్న 170 ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాలను నిర్మిస్తామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని భవనాలు ఒకే నమూనాలో, ప్రజలకు అందుబాటులో ఉండేట్లు డిజైన్ చేయనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రితో చర్చించి డిజైన్లకు తుది రూపు ఇస్తామని వివరించారు. తక్కువ ఖర్చుతో ప్రజలకు అత్యుత్తమ సేవలు అందేలా ఈ భవనాల నిర్మాణం ఉంటుందని పేర్కొన్నారు. ఇవాళ సచివాలయంలోని తన కార్యాలయంలో రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి పొంగులేటి అద్దె భవనాల్లో కొనసాగుతున్న తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల గురించి ఆరా తీశారు. రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థను ఆధునికీకరించి, ప్రజలకు వేగవంతమైన సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్లు తెలిపారు.

# న్యాయవ్యవస్థ ప్రతిష్ఠకు భంగం



కొన్ని రోజులు ఆగండి. దీనిపై నేను సుమోటోగా విచారణ చేపడతాను. న్యాయవ్యవస్థ ప్రతిష్ఠకు భంగం కలిగించే చర్యలను సహించబోం. చట్టం తన పని తాను చేసుకుపోతోంది'' అని సుప్రీం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ తీవ్రంగా స్పందించారు. NCERT 8వ తరగతి విద్యార్థులకు న్యాయవ్యవస్థలో అవినీతి గురించి బోధిస్తోందని సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ సుప్రీంకోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఈ క్రమంలోనే అత్యున్నత న్యాయస్థానం నుంచి స్పందన వచ్చింది. న్యాయవ్యవస్థ ప్రతిష్ఠకు భంగం

## శత్రువు దాడి చేయాలంటే భయపడాలి

**చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్**

ఈ కబురు, హైదరాబాద్: మారుతున్న కాలానికి అనుగుణంగా యుద్ధతంత్రాలు భౌతికం నుంచి సింథటిక్, కాగ్నిటివ్ రంగాలకు విస్తరిస్తున్నాయని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్(సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్ అన్నారు. భారత సాయుధ దళాలు ఇప్పుడు ఇంటెలిజెంట్ వార్‌ఫేర్ వైపు మళ్లాల్సిన అవసరం ఉందన్నారు. సికింద్రాబాద్‌లోని కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్ (సీడీఎం)లో మంగళవారం, బుధవారం మల్టీ డొమైన్ ఇంటిగ్రేటెడ్ టెక్నలాజికల్లీ-ఎంపవర్డ్ రెసిలియంట్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్(మిత్రా) సమావేశాలు జరిగాయి. రెండో రోజు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై భారత రక్షణ వ్యూహాల్లో రాబోయే విప్లవాత్మక మార్పుల గురించి కీలక ప్రసంగం చేశారు. "కేవలం మల్టీ డొమైన్ ఆపరేషన్స్‌కు(ఎండీవోకి) పరిమితం కాకుండా ఆల్ రియల్మ్స్ ఆల్ డొమైన్ ఆపరేషన్స్(అరాడో) దిశగా భారత సైన్యం పరిణామం చెందాలి. ఎండీవోలో భూమి, ఆకాశం, సముద్రం, అంతరిక్షం, సైబర్ రంగాల మధ్య సమన్వయం ఉంటుంది... అరాడో అంతకంటే విస్తృతమైనది. ఇది యుద్ధాన్ని భౌతిక సరిహద్దులకే పరిమితం చేయకుండా మేధోపరమైన రంగాలపై దృష్టి పెడుతుంది. శత్రువు ఆలోచనా విధానాన్ని, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని దెబ్బతీస్తుంది.

## సీఎం కప్‌లో భెల్ క్రీడాకారుడికి

# బంగారు పతకాలు

ఈ కబురు, పటాన్‌చెరు: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ టోర్నమెంట్‌లో బీహెచ్‌ఈఎల్‌కు చెందిన స్కేటింగ్ క్రీడాకారుడు జి. శ్రీ అక్షయ్ రెండు బంగారు, ఒక బ్రాంజ్ పతకాలు సాధించాడు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో సరూర్ నగర్‌లో నిర్వహించిన రెండో దశ సీఎం కప్‌లో శ్రీ అక్షయ్ ఈ ఘనత సాధించాడు. శ్రీ అక్షయ్ గత పదేళ్లుగా బీహెచ్‌ఈఎల్‌లోని స్కేట్ నైన్ అకాడమిలో కోచ్ విట్టల ఉప్పులూరి వద్ద శిక్షణ పొందతున్నాడు. వికాస్ ఎపిస్టెమో స్కూల్లో లెవన్త్ గ్రేడ్ చదువుతున్న శ్రీ అక్షయ్ గతంలో రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గ్వాలియర్‌లో జరిగిన స్కూల్ గేమ్ ఫెడరేషన్‌లో కూడా ఉత్తమ ప్రతిభను కనబరిచి రాష్ట్రానికి మంచి పేరు తీసుకొచ్చాడు. బుధవారం శ్రీ అక్షయ్‌ను స్కూల్ ప్రిన్సిపల్ కొల్లి పద్మ, ఇతర సిబ్బంది అభినందించారు. బీహెచ్‌ఈఎల్‌లోని అకాడమి వద్ద శ్రీ అక్షయ్‌ను తోటి క్రీడాకారులు, కోచ్ తదితరులు సత్కరించారు. మరిన్ని పతకాలు సాధించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్రానికి, అకాడమికి పేరు తీసుకురావాలని కోచ్ విట్టల ఆకాంక్షించారు.



శ్రీ అక్షయ్‌ను అభినందిస్తున్న స్కూల్ ప్రిన్సిపల్ కొల్లి పద్మ

## బాసర ట్రిబుల్‌ఐటీలో ఇంజినీరింగ్ విద్యార్థిని ఆత్మహత్య





**ఈ కబురు, ఆదిలాబాద్ :**

బాసర ట్రిపుల్ ఐటీలో విషాదకర ఘటన చోటు చేసుకుంది. ఇంజనీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్న వసంత అనే విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్నట్లు నివేదించబడింది. రేవంత్ రెడ్డి పాలనలో విద్యాలయాలు మృత్యుకూపాలుగా మారుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఏదో ఒక చోట విద్యార్థులు బలవన్మరణానికి పాల్పడుతున్నారు. మృతురాలిది స్వస్థలం వనపర్తి జిల్లాగా గుర్తించారు. అధికారులు మృతదేహాన్ని గుట్టు చప్పుడు కాకుండా బైంసా ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. ఈ సంఘటన విద్యార్థి సంఘాలతో పాటు, తల్లిదండ్రులలో తీవ్ర ఆందోళనను రేకెత్తించింది. పూర్తి నివేదిక మరియు అధికారిక ప్రకటనల కోసం టీవీ9 కథనాన్ని వీక్షించాల్సిందిగా కోరడమైనది. ఈ దుర్ఘటన బాసర క్యాంపస్‌లో భద్రత మరియు విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. విద్యార్థుల భద్రత, శ్రేయస్సు పట్ల కళాశాల యాజమాన్యం సరైన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

--ప్రేమ విషయమే కారణమా..?

వసంత ఆత్మహత్యకు ప్రేమ విఫలం కావడం కారణమని వైరల్ అవుతోంది. ఆమె గణేష్ అనే యువకుడ్ని ప్రేమిస్తోందని, ఆ యువకుడు తన స్వగ్రామంలో ఆత్మహత్య చేసుకున్నాడని సమాచారం. అంతకుముందు తన ఫోన్, వాట్సాప్ లో వసంత నెంబర్ బ్లాక్ చేసినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో వసంత సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్య చేసుకుందని ట్రిపుల్ ఐటీ విద్యార్థులు చెబుతున్నారు. అయితే పోలీసుల దర్యాప్తులో అసలు విషయాలు బయటకు రానున్నాయి.

## యూకే ప్రయాణం.. భారతీయులకు ఈవీసా తప్పనిసరి

**ఈ కబురు : యూకేలో కొత్త డిజిటల్ వీసా (visa) వ్యవస్థ నేటి నుంచి అమల్లోకి వచ్చింది. సంప్రదాయ వీసాల స్థానంలో ఈ-వీసా (Electronic visa)లను అందుబాటులోకి తెచ్చారు. యూకేకు వెళ్లే భారతీయులు ఇకమీదట ఈ-వీసా కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇందులో ఇమిగ్రేషన్ స్టేటస్‌కు సంబంధించిన షేర్ కోడ్ ఉంటుంది. దీన్ని ఉద్యోగ సంస్థలు, యజమానులు తదితరులతో పంచుకునే అవకాశం కల్పించారు.**

ఈ కొత్త పద్ధతిలో పేపర్ ఆధారిత వీసా స్టిక్కర్ల స్థానంలో డిజిటల్ వీసాలను అమలు చేయనున్నారు. డిజిటల్ వ్యవస్థ అయినప్పటికీ.. బయోమెట్రిక్ నమోదు కోసం వీసాదారులు దరఖాస్తు కేంద్రానికి వెళ్లాల్సిందే. అయితే, ప్రాసెసింగ్ సమయంలో పాస్‌పోర్టును అక్కడే వదిలి వెళ్లాల్సిన అవసరం మాత్రం ఉండదు. ఈవీసా లేదా ఇతర దస్త్రాలు లేకుంటే విమానయాన సంస్థలు ప్రయాణికులను అడ్డుకునే అవకాశం ఉంటుంది.

ఈవీసాను పోగొట్టుకోవడం, తస్కరించడం లేదా మార్పు చేసే అవకాశం ఉండదని, వీసాదారులు ఇమిగ్రేషన్‌ను వేగంగా, సురక్షితంగా నిర్ధరించుకునే వీలుకలుగుతుందని బ్రిటన్ అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుత ఇమిగ్రేషన్ స్థితిలో మార్పులు చేయడం కూడా సాధ్యం కాదన్నారు. బ్రిటన్ సరిహద్దు, ఇమిగ్రేషన్ వ్యవస్థను పూర్తి స్థాయిలో నవీకరించడంలో భాగంగా ఈవీసా విధానాన్ని గతేడాది ప్రారంభించారు. నేటి నుంచి పూర్తి స్థాయిలో అమల్లోకి వచ్చింది.




## సుప్రీంకోర్టులో మల్లారెడ్డికి దక్కని ఊరట



తన భూమికి వెళ్లే దారిని మూసివేశారని, ఈ విషయంలో తహసీల్దార్ జారీ చేసిన లేఖను కూడా ఆయన తన పిటిషన్‌లో సవాల్ చేశారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు సింగిల్ జడ్జి, 45 రోజుల్లోగా సర్వే పూర్తి చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ తీర్పును మల్లారెడ్డి తదితరులు డివిజన్ బెంచ్‌లో సవాల్ చేయగా, సింగిల్ జడ్జి ఉత్తర్వులను ద్విసభ్య ధర్మాసనం సమర్థించింది. దీంతో వారు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై నిన్న జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఎన్.వి. అంజరియాలతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం విచారణ జరిపింది. సర్వే ప్రక్రియ ఇప్పటికే పూర్తయినందున, ఈ దశలో తాము జోక్యం చేసుకోలేమని స్పష్టం చేస్తూ పిటిషన్‌ను తోసిపుచ్చింది.

# ఏపిలో సాగునీటి ప్రాజెక్టులకు బ్లూప్రింట్

రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రతీ ఎకరాకూ నీరివ్వాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని వెల్లడించారు. దీనికోసం విశ్రాంత ఇంజనీర్లతో ఓ బృందాన్ని వేసి అధ్యయనం చేయిస్తామని తెలిపారు. ప్రతీ ఎకరాకూ సాగునీరు ఇచ్చే అంశంపై బ్లూ ప్రింట్ తయారు చేస్తామని అన్నారు. మార్కాపురం జిల్లా దోర్నాల మండలం గంటవాని పల్లెలో రూ.456 కోట్లతో వెలుగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్ పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. రైతులతో కలిసి పనులను పరిశీలించారు. అనంతరం మార్కాపురంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ...'గత ఐదేళ్లలో రాష్ట్రంలో విధ్వంసం జరిగింది. రాష్ట్ర పునర్నిర్మాణం కోసం టీడీపీ, బీజేపీ, జనసేన కూటమికి ప్రజలు 94 శాతం స్ట్రైక్ రేటు ఇచ్చారు. అరకు మొదలుకొని ప్రకాశం వరకూ మంచి విజయం అందించారు. మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో మార్కాపురం, మదనపల్లి, పోలవరం ప్రాంతాలను జిల్లాలు చేస్తానని మాట ఇచ్చి ఇప్పుడు నిలబెట్టుకున్నాను. ఇక్కడి ప్రజలు 150 కిలోమీటర్లు ప్రయాణించి ఒంగోలు కు వెళ్లాల్సిన పని లేకుండా మార్కాపురాన్ని జిల్లా చేశాను. అన్యాయం జరిగిన మదనపల్లికి న్యాయం చేశా' అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

--శంకుస్థాపనతో పాటు ప్రారంభించే అవకాశం నాకే వచ్చింది

1996,మార్చి 5న ఈ ప్రాంతంలో నేను పర్యటించినప్పుడు ప్రజల కష్టాలు కళ్ళారా చూశాను. శ్రీశైలం నుంచి నీరివ్వమని ఇక్కడి ప్రజలు నన్ను కోరారు. ఆనాడు వెలుగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించాం. భగవంతుడు మళ్లీ నాకే అవకాశం ఇచ్చాడు. వెలుగొండను పూర్తి చేసి మీ జీవితాల్లో వెలుగులు తెస్తాను. రైతులను ఆదుకుంటాం. 20142019లో ప్రాజెక్టు పనులు పరుగులు పెట్టించాం. ఈ ప్రాజెక్టు ద్వారా 4.35 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించడమే లక్ష్యం. దీని వల్ల గిద్దలూరు, మార్కాపురం, ఎర్రగొండపాలెం, కనిగిరి నియోజకవర్గాలకే కాకుండా ఉదయగిరి, కడప జిల్లా బద్వేలుకు కూడా నీరు అందుతుంది. 2019లో మనమే అధికారంలోకి వచ్చి ఉంటే 2021లోనే ప్రాజెక్టు పూర్తి చేసి నీరిచ్చేవాళ్లం. 20192024 మధ్య చీకటి రోజులు వచ్చాయి. గత ముఖ్యమంత్రి వెలిగొండ పూర్తి కాకుండానే జాతికి అంకితమంటూ దొంగ నాటకాలు ఆడాడు. చీమకుర్తి, మార్కాపురం సభల్లో 2023లో పూర్తి చేస్తానని హామీ ఇచ్చాడు. ఉత్తుత్తి ప్రాజెక్టుకు రిబ్బన్ కటింగ్ చేశాడు. ఇలా చేయడం మోసం కాదా. నేను చేయగలిగిందే చెబుతున్నాను. వెలిగొండ ప్రాజెక్టుకు పూర్తికి రూ.9081 కోట్ల నిధులు కావాలి. ఇప్పటి వరకూ ప్రాజెక్టు నిర్మాణానికి రూ.5451 కోట్లు ఖర్చు వ్యయం చేశాం. భూసేకరణకు రూ.484 కోట్లు, పునరావాసానికి రూ.184 కోట్లు ఖర్చు చేశాం. రెండు దశల్లో ఈ ప్రాజెక్టు పూర్తి చేయాలని ప్రణాళిక చేశాం. ఇంకా రూ.2,540 కోట్లు ఖర్చు చేస్తే కానీ వెలిగొండ పనులు పూర్తి కావు. గడచిన 20 నెలల్లో రూ.540 కోట్లు ఖర్చు చేసి పనులు వేగంగా చేపట్టాం. రూ.456 కోట్లతో విలువైన ఫీడర్ కెనాల్ లైనింగ్ పనులకు శంకుస్థాపన చేశాను. గత పాలకులు ఐదేళ్లలో ఈ ప్రాజెక్టుకు కేవలం రూ.500 కోట్లు ఖర్చు చేసి పనులు అయిపోయాయని రైతులకు పంగ నామాలు పెట్టారు. మంచి చేసిన వారికి అండగా నిలుస్తేనే ప్రజల జీవితాలు మెరుగు అవుతాయని ముఖ్యమంత్రి అన్నారు.



--రూ.1300 కోట్లతో ప్రతీ ఇంటికీ సురక్షిత తాగునీరు

అన్ని వర్గాలకు న్యాయం చేయడమే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యం. ఎక్కడ పేదలు ఉంటే అక్కడ నేను ఉంటాను. ఎన్నికల్లో చెప్పినట్టే సూపర్ సిక్స్ సూపర్ హిట్ చేశాం. పింఛన్ల కోసం ప్రతి ఏటా రూ.34 వేల కోట్లు వెచ్చిస్తున్నాం. ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంత మందికి తల్లికి వందనం ఇస్తున్నాం. స్త్రీ శక్తి కింద ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్నాం. మగవారితో సమానంగా మహిళలకు అవకాశాలు రావాలని డ్వాక్రా సంఘాలు స్థాపించాను. ఈ ఏడాది లక్షమంది ఆడబిడ్డలను పారిశ్రామికవేత్తలుగా తయారుచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. దీపం పథకం కింద మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. అన్నదాత సుఖీభవ కింద రైతులకు మూడు విడతల్లో రూ. 20,000 ఇస్తున్నాం. 2027లో పుష్కరాలకు ముందే పోలవరం పూర్తిచేసి జాతికి అంకితం చేస్తాం. నల్లమల సాగర్ కు గోదావరి నీళ్లు ఇస్తాం. అది వచ్చేలోగా ఈ ఏడాది జూలై నాటికి నల్లమల సాగర్ పూర్తి చేసి వెలిగొండ ప్రాజెక్టు జాతికి అంకితం చేస్తాం. ఈ ప్రాజెక్టు కోసం ఇంకా రూ. 2 వేల కోట్లు ఖర్చు చేయాల్సి ఉంది. గతేడాది హంద్రినీవాపై శ్రద్ధ పెట్టాం. ఈ ఏడాది వెలిగొండ పై శ్రద్ధ పెట్టి ప్రజల జీవితాల్లో జలకళ తీసుకొస్తాం. హార్టికల్చర్ కు ఎక్కువ ప్రాధాన్య ఇస్తున్నాం. రాయలసీమను హార్టికల్చర్ హబ్ గా మారుస్తున్నాం. సీమతో పాటు మార్కాపురం, ప్రకాశం జిల్లాలను ఉద్యాన పంటలతో అభివృద్ధి చేస్తాం. మార్కాపురాన్ని ఉద్యాన పంటలకు కేంద్రంగా తయారు చేసేందుకు ప్రజలు సహకరించాలి. రూ.1300 కోట్లు వ్యయంతో నల్లమల సాగర్ నుంచి ప్రతి ఇంటికి సురక్షిత నీరు అందించే బాధ్యత తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

--రూ.50 కోట్లతో జిల్లా కలెక్టరేట్ నిర్మిస్తాం

ప్రజలకు హామీ ఇచ్చినట్టుగానే మార్కాపురాన్ని జిల్లాగా చేసి ఇక్కడి ప్రజల ఆకాంక్షల్ని నెరవేర్చాం. మార్కాపురం జిల్లాలో భూ రికార్డుల సమస్యలున్నాయి. మేము అధికారంలోకి వస్తూనే ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు చేశాం. గత పాలనలో ల్యాండ్ రికార్డులన్నీ అస్తవ్యస్తం చేశారు. అడిగిన భూములు ఇవ్వకపోతే 22ఏలో పెట్టారు. సర్వే రాళ్లపై వారి ఫోటోలు వేసుకున్నారు. మేము రాజముద్రతో పట్టదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నాం. క్యూఆర్ కోడ్ తో భూమి రికార్డులు భద్రంగా తయారు చేయిస్తున్నాం. ఎవరైనా తప్పు రికార్డులు చేస్తే తాట తీస్తామని హెచ్చరిస్తున్నాను. మార్కాపురం జిల్లా నూతన కలెక్టరేట్ భవనానికి రూ. 50 కోట్లు మంజూరు చేస్తున్నాం. 20 నెలల పాలనలో రూ. 20 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయి. యువతకు ఉద్యోగాలు ఇప్పించే బాధ్యత తీసుకుంటాం. అవినీతికి తావు లేకుండా మెగా డీఎస్సీ నిర్వహించాం. కానిస్టేబుళ్ల నియామకాలు పూర్తి చేశాం. వరద నీరు వృథాగా పోకుండా భూగర్భ జలాలు పెంచుతాం. గోదావరి నుంచి 6000 టీఎంసీలు, కృష్ణా నుంచి 1500 టీఎంసీల నీరు వృథాగా సముద్రంలోకి వెళ్లింది. వెలిగొండ ప్రాజెక్టుకు కావాల్సింది కేవలం 53 టీఎంసీల నీరే. ఈ జిల్లాలో ఫ్లోరైడ్ సమస్య ఉంది. ఫ్లోరైడ్ సమస్య ఉన్న ప్రాంతాల్లో సురక్షిత నీరు సరఫరా చేస్తాం. పరిశుభ్రమైన రాష్ట్రం కోసం ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర నిర్వహిస్తున్నాం. పేదలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు పీ4 కార్యక్రమం చేపట్టాం. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పౌరులకు ప్రభుత్వ సేవలు అందిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

--2019-24 మధ్య రాష్ట్రానికి చీకటి రోజులు

గత పాలకులు చేయని అపచారం లేదు. కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల వెంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడారు. కెమికల్స్ కలిపిన నెయ్యితో లడ్డూలు చేసి విక్రయించారు. ఆ నెపాన్ని హెరిటేజ్ పై మోపారు. ఆనాడు బాబాయ్ ని చంపేసి మరుసటి రోజు సాక్షి పత్రికలో నారా సుర రక్త చరిత్ర అని నా చేతిలో కత్తి పెట్టాడు. నోరు తెరిస్తే బూతులు మాట్లాడతారు. నా తల్లి, భార్య, మా పార్టీ నేతలను ఇష్టానుసారంగా దుర్భాషలాడారు. ప్రజా సమస్యలపై చర్చించేందుకు అసెంబ్లీకి రారు కానీ అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా కావాలంటారు. వాళ్లు బెదిరిస్తే ఇవ్వాలా. ప్రజాస్వామ్యంలో ప్రజలు ఓట్లు వేస్తేనే ఏదైనా సాధ్యం అని కూడా వారికి తెలీదా? గత ఐదేళ్లలో రాష్ట్రంలో విధ్వంస జరిగింది. ప్రజలు ఇంట్లో నుంచి బయటకు రావాలంటే భయపడ్డారు. గంజాయి, భూ కబ్జాలు, దౌర్జన్యాలతో హడలిపోయారు. నేను ఎవరు తిట్టినా లెక్కపెట్టుకోను. నేను జీవిస్తోంది ప్రజలు, రాష్ట్రం కోసమే. నాకు కుల, మత విభేదాలు లేవు. తెలుగు జాతి అభ్యున్నతి నాకు ముఖ్యం. బడుగు, బలహీన వర్గాలను పైకి తీసుకొచ్చి అవకాశాలు కల్పిస్తాం. నేను ఆనాడు టెక్నాలజీని ప్రమోట్ చేశాను. మన దూరదృష్టి కారణంగా దేశంలోనే అత్యధిక తలసరి ఆదాయం తెలంగాణ నుంచి వస్తోంది. గుజరాత్ రాష్ట్రంలో 25 ఏళ్లుగా ఒకే పార్టీ అధికారంలో ఉంది. మోదీ 3వ సారి ప్రధాని అయ్యారు. మరోసారి అవుతారు. ప్రజలు ఏది మంచి, ఏది చెడు అనేది ఆలోచన చేసి... కుల, మత, ప్రాంతాలకు అతీతంగా సమర్థులను గెలిపించాలని ముఖ్యమంత్రి కోరారు.

--స్థానిక రైతులతో కలిసి ఫీడర్ కాలువ పనులు పరిశీలన

వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కాలువ పనుల శంకుస్థాపన అనంతరం రైతులు వెంకటేశ్వరరెడ్డి, సురవరం గండి వీరారెడ్డిలతో సంభాషిస్తూ ఫీడర్ కెనాల్ పనుల్ని ముఖ్యమంత్రి చంద్రబాబు పరిశీలించారు. వెలిగొండ పూర్తి అయితే ఈ ప్రాంత భూగర్భజలాలు కూడా పెరుగుతాయని, బోర్లకు, చెరువులకు నీరు వస్తాయని ముఖ్యమంత్రికి రైతులు వివరించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు పనులు, ఫీడర్ కాలువ పనులు వేగంగా చేపడుతున్నందుకు ముఖ్యమంత్రికి స్థానిక రైతులు ధన్యవాదాలు తెలిపారు. అరటి, బొప్పాయి లాంటి పంటల సాగు చేసేందుకు అనుకూల ప్రాంతమని, మీరే శంకుస్థాపన చేశారు, మీరే ప్రాజెక్టు ప్రారంభోత్సవం చేస్తున్నారని సీఎంతో రైతులు అన్నారు. ప్రాజెక్టులో రూ.2500 కోట్ల విలువైన పనులు మిగిలి ఉన్నా వాటిని పూర్తి చేయకుండా జాతికి అంకింతం చేసినట్టు గత పాలకులు నాటకాలాడారని ముఖ్యమంత్రి అన్నారు.

--వెలిగొండ పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష

ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితి, పనులు జరుగుతున్న తీరుపై అధికారులతో ముఖ్యమంత్రి సమీక్షించారు. 11,580 క్యూసెక్కుల నీరు ప్రవహించేలా ఫీడర్ కాలువ పనులు చేపట్టామని జల వనరుల శాఖ అధికారులు వివరించారు. నల్లమల సాగర్ ప్రాంతంలో మూడు గ్యాప్స్ ఫిల్ చేసి రిజర్వాయర్ ఏర్పడిందని ,తద్వారా 53.83 టీఎంసీల నీరు నిల్వ చేసుకునే అవకాశం ఉందని ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. రోజుకు 200 మీటర్ల మేర కాలువ లైనింగ్ పనులు చేస్తున్నామని, 1.80 లక్షల క్యూబిక్ మీటర్ల మేర సైడ్ వాల్ పనులు మే చివరి నాటికి పూర్తి చేస్తామని ముఖ్యమంత్రికి తెలిపారు. ఫ్లడ్ సీజన్ ప్రారంభం అయ్యే సమయానికి ఫీడర్ కాలువ సిద్ధం అయిపోతుందని వెల్లడించారు. 45 రోజుల్లో 45 టీఎంసీల మేర నీరు డ్రా చేసుకుని నల్లమల సాగర్ నింపేందుకు ప్రణాళిక చేసినట్టు అధికారులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరించారు. వెలిగొండ ప్రాజెక్టు సొరంగాలు, కాలువ పనులు తదితర అంశాలను నమూనా ద్వారా వివరించారు. కంబం చెరువును కూడా నింపేలా కాలువను అనుసంధానించినట్టు తెలిపారు. స్థానికంగా వివిధ చెరువులు, నీటి వనరుల్ని నింపేందుకు అవసరమైన స్ట్రక్చర్లను పూర్తి చేయాలని సీఎం అధికారులకు ఆదేశించారు. రూ. 400 కోట్లతో ఈ పనులు చేపట్టేందుకు వీలుగా కార్యాచరణ చేపట్టాలని సూచించారు. వెలిగొండ టన్నెళ్ల పనులు పూర్తి అయ్యాక, పోరుమామిళ్ల, రాచర్లకు కూడా నీరు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా పనులు పూర్తి చేయాలని, వెలిగొండ ప్రాజెక్టు పనుల పురోగతి ఎప్పటికప్పుడు తనకు తెలియచేయాలని ఉన్నతాధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు.

--మార్కాపురంలో ముఖ్యమంత్రికి అపూర్వ స్వాగతం

నూతన జిల్లాగా ఏర్పడిన తర్వాత తొలిసారి మార్కాపురంలో పర్యటించిన ముఖ్యమంత్రికి ఘన స్వాగతం లభించింది. మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, నిమ్మల రామానాయుడు, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, జిల్లా వ్యాప్తంగా ప్రజాప్రతినిధులు స్వాగతం పలికారు. జిల్లా ఏర్పాటు కలను నిజం చేసినందుకు ముఖ్యమంత్రికి నాయకులు ధన్యవాదాలు తెలిపారు. మార్కాపురం జిల్లా కళ, వెలిగొండ జలకళ సభకు హాజరైన ముఖ్యమంత్రికి ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించింది. వేదిక నుంచి ప్రజల మధ్యకు వేసిన ర్యాంపు పై నడుస్తూ, ప్రజలకు అభివాదం చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగించారు. ప్రజలు హర్షాతిరేకాల మధ్య ఆయన ప్రసంగం యావత్తూ ఉత్సాహంగా సాగింది. సభకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భారీగా ప్రజలు, అభిమానులు తరలి వచ్చారు.

## మదుపర్ల ప్రాఫిట్ బుకింగ్..
### స్వల్ప లాభాలతో ముగిసిన సూచీలు




దేశీయ మార్కెట్లు బుధవారం ఫ్లాట్‌గా ముగిశాయి (Stock Market Toady). అంతర్జాతీయ మార్కెట్లలో అనిశ్చిత పరిస్థితులతో మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూశారు. మరోవైపు విదేశీ సంస్థాగత మదుపర్లు అమ్మకాలకు దిగారు. దీంతో ప్రారంభ లాభాలు ఆవిరయ్యాయి.

క్రితం సెషన్‌లో భారీ నష్టాలతో ముగిసిన సెన్సెక్స్ (నిన్నటి ముగింపు 82,225).. నేటి ట్రేడింగ్‌లో కోలుకుంది. ఉదయం 82,530 వద్ద ప్రారంభమైంది. ఒక దశలో 800 పాయింట్ల మేర ఊగిసలాటకు గురైంది. ఇంట్రాడేలో 82,957 గరిష్ఠానికి.. 82,132 కనిష్ఠానికి చేరింది. చివరకు 50 పాయింట్ల స్వల్పలాభంతో 82,276 వద్ద, నిఫ్టీ 57 పాయింట్ల లాభంతో 25,482 వద్ద ముగిశాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 90.95వద్ద స్థిరపడింది. నిఫ్టీ సూచీలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, బజాజ్ ఆటో, టాటా స్టీల్, శ్రీరామ్ ఫైనాన్స్, ఆదానీ ఎంటర్‌ప్రైజెస్ షేర్లు రాణించగా.. రిలయన్స్, ఎస్‌బీఐ, అదానీ పోర్ట్స్, ఎటర్నల్, భారతీ ఎయిర్‌టెల్ స్టాక్స్ నష్టాలను చవిచూశాయి.




## ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో రూ.590 కోట్ల మోసం..
## మాస్టర్‌మైండ్ అతడే..!

**ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో రూ.590కోట్ల మోసం ఘటన బ్యాంకింగ్ రంగంలో సంచలనం సృష్టించింది. ఈ కేసు దర్యాప్తులో కీలక విషయాలు బయటపడ్డాయి. ఈ కుంభకోణం సూత్రధారి బ్యాంకు మాజీ ఉద్యోగేనని తేలింది. బ్యాంకింగ్ (IDFC First bank fraud) ప్రక్రియను తారుమారు చేసి ప్రభుత్వానికి చెందిన ఈ నిధులను అతడు షెల్ కంపెనీలకు మళ్లించినట్లు వెల్లడైంది. దీంతో ఆ మాస్టర్‌మైండ్ సహా అతడికి సహకరించిన మరో ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు.**

హరియాణా (Haryana)లో చండీగఢ్‌లోని ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ శాఖలో జరిగిన మోసం కేసులో నలుగురు నిందితులను పోలీసులు మంగళవారం రాత్రి అరెస్ట్ చేశారు. నిందితులను రిభవ్ రిషి, అభయ్ కుమార్, అభిషేక్ సింగ్లా, స్వాతి సింగ్లాగా గుర్తించారు. వీరిలో ఇద్దరు గతంలో ఐడీఎఫ్‌సీ బ్యాంకులో పనిచేసిన ఉద్యోగులు కాగా.. మరో ఇద్దరు ప్రైవేటు వ్యక్తులని పోలీసులు తెలిపారు. ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకులో మాజీ మేనేజర్ అయిన రిభవ్ రిషి ఈ మోసానికి మాస్టర్‌మైండ్ అని, అతడే ఈ కుట్ర మొత్తాన్ని అమలుచేసినట్లు వెల్లడించారు. ప్రస్తుతం రిషి చండీగఢ్‌లోని ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌లో పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈనేపథ్యంలో నిందితులను విచారిస్తున్నట్లు పేర్కొన్నారు.

**మోసం జరిగిందిలా..**

హరియాణా ముఖ్యమంత్రి గ్రామీణ్ ఆవాస్ యోజన 2.0 స్కీమ్‌కు సంబంధించిన నిధులను జమ చేసేందుకు ఆ విభాగం అధికారులు 2025 సెప్టెంబరు 26న ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుల్లో రెండు ఖాతాలు తెరిచారు. తొలుత ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో రూ.50కోట్లు, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌లో రూ.25 కోట్లు జమ చేశారు. అయితే, ఆ నిధులను వినియోగించేందుకు రాష్ట్ర ఆర్థిక శాఖ నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాకపోవడంతో ఈ ఖాతాలను మూసివేయాలని ప్రభుత్వ అధికారులు నిర్ణయించుకున్నారు. ఆ ఖాతాల్లో ఉన్న డబ్బు మొత్తాన్ని వడ్డీతో సహా మరో ఖాతాకు బదిలీ చేయాలంటూ ఈ రెండు బ్యాంకులకు ఈ ఏడాది జనవరి 13న లేఖలు పంపారు.

దీంతో జనవరి 16న ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ రూ.25.45 కోట్లను హరియాణా ప్రభుత్వానికి చెందిన మరో అకౌంట్‌కు బదిలీ చేసి తమ ఖాతాను మూసేసింది. అయితే, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ మాత్రం కేవలం రూ.1.27 కోట్లను మాత్రమే ట్రాన్స్‌ఫర్ చేసింది. దీంతో ఖాతాలో ఉన్న రూ.50 కోట్ల నిధులు ఏమయ్యాయని హరియాణా ప్రభుత్వ విభాగం బ్యాంకును ప్రశ్నించింది. దీనికి బ్యాంకు నుంచి ఎలాంటి సమాధానం రాకపోవడంతో విచారణ కమిటీ వేసింది.

ఈ విచారణలో విస్తుపోయే విషయాలు బయటపడ్డాయి. ప్రభుత్వ అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి ఆ ఖాతా నుంచి నిధులను షెల్ కంపెనీలకు చెందిన మరో బ్యాంకు ఖాతాలకు బదిలీ చేసినట్లు తేలింది. ఈ కుట్రంతా రిభవ్ రిషినే చేసినట్లు తెలిసింది. ఈ సందర్భంగా బ్యాంకులో నిర్వహణపరమైన లోపాలు కూడా బయటపడ్డాయి. తప్పుల తడకగా కొన్ని లావాదేవీలను నిర్వహించినట్లు తెలిసింది. దీంతో గుట్టు లాగగా.. ప్రభుత్వ ఖాతాల్లోని మొత్తం రూ.590 కోట్ల నిధులను దారి మళ్లించినట్లు తేలింది. దీనిపై దర్యాప్తు చేపట్టిన అధికారులు.. ఇప్పటికే ఆ సొమ్ము మొత్తాన్ని రికవరీ చేసినట్లు హరియాణా సీఎం నాయబ్ సింగ్ సైనీ వెల్లడించారు. ఈ మోసం నేపథ్యంలో ప్రభుత్వ ఖాతాలను నిర్వహించకుండా ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌పై నిషేధం విధించినట్లు పేర్కొన్నారు.

## విమానయాన సంస్థల నష్టాలు
## రూ.17,000- 18,000 కోట్లు



ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (202526) భారత విమానయాన సంస్థల నష్టాలు రూ.17,000 18,000 కోట్లుగా ఉండొచ్చని రేటింగ్స్ సంస్థ ఇక్రా అంచనా వేసింది. 202425 నష్టం రూ.5500 కోట్లతో పోలిస్తే ఇది చాలా ఎక్కువ అని పేర్కొంది. అయితే వచ్చే ఆర్థిక సంవత్సరంలో మాత్రం నష్టాలు రూ.11,000 12,000 కోట్లకు పరిమితం కావచ్చని వెల్లడించింది. దేశీయంగా విమాన ప్రయాణికుల రద్దీ పెరుగుతుండటం, డిసెంబరులో ఇండిగో పరిణామాల తర్వాత తిరిగి కార్యకలాపాలు సాధారణ స్థాయికి రావడం ఇందుకు దోహదం చేస్తాయని ఇక్రా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కింజాల్ షా తెలిపారు. 202526లో నష్టాలు బాగా పెరిగే అవకాశం ఉన్నప్పటికీ.. దేశీయ విమానయాన రంగంపై 'స్థిరత్వం'తో కూడిన అంచనానే కొనసాగిస్తున్నట్లు ఇక్రా పేర్కొంది.

**ప్రయాణికుల రద్దీ అంచనాల్లో కోత**

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి దేశీయ విమాన ప్రయాణికుల సంఖ్యలో పెరుగుదల 46% ఉంటుందని గతంలో అంచనా వేయగా, ప్రస్తుతం 03 శాతానికి ఇక్రా తగ్గించింది. వాతావరణ ప్రతికూలతలు, 2025 జూన్‌లో విమానం కూలిన ఘటన, డిసెంబరులో ఇండిగో సర్వీసుల రద్దు పరిణామాలు ఇందుకు కారణమవుతాయని వివరించింది. 202627లో దేశీయ విమాన ప్రయాణికుల రద్దీ 68% పెరిగి 17.5 17.9 కోట్ల మందికి చేరొచ్చని వెల్లడించింది.

అంతర్జాతీయ విమాన ప్రయాణికుల రద్దీలో బలమైన వృద్ధి ఉండొచ్చని తెలిపింది. లో బేస్ ఎఫెక్ట్ ఇందుకు కలిసి వస్తుందని పేర్కొంది. ఇవీసా/ వీసా ఆన్ ఎరైవల్ విస్తృతి పెరగడం, థీమ్ బేస్డ్, ప్రత్యేక పర్యాటక గమ్యస్థానాల అభివృద్ధికి కేంద్రం ప్రాధాన్యం ఇస్తుండటం కూడా తోడ్పడుతుందని వివరించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అంతర్జాతీయ విమాన ప్రయాణికుల సంఖ్య 79%, వచ్చే ఆర్థిక సంవత్సరంలో 810%పెరిగే అవకాశం ఉందని ఇక్రా తెలిపింది. 2025 డిసెంబరు 31 నాటికి దేశీయ విమానయాన సంస్థల వద్ద ఉన్న మొత్తం విమానాల సంఖ్య 865గా ఉంది. 2026 జనవరి 31నాటికి మొత్తంగా 1,700 విమానాల డెలివరీ పెండింగ్‌లో ఉంది. రాబోయే పదేళ్లలో ఈ విమానాలు కంపెనీలకు సరఫరా కావొచ్చు.

### ఆంథ్రోపిక్.. అనతి కాలంలోనే టెక్
## దిగ్గజాలను అధిగమించి!

**టెక్ రంగంలో 'ఆంథ్రోపిక్' ఏఐ (Anthropic AI) ప్రకంపనలు సృష్టిస్తోంది. కొత్త ఏఐ మోడళ్లతో కంపెనీలను ఆకర్షిస్తోంది. దీంతో ఆ సంస్థ మార్కెట్ విలువ అనతికాలంలోనే రికార్డు స్థాయికి చేరింది. ఐదేళ్ల క్రితం స్టార్టప్‌గా ప్రారంభమైన ఆ సంస్థ.. మార్కెట్ విలువలో అనేక టెక్ దిగ్గజాలను మించిపోతోంది. తాజాగా ఆంథ్రోపిక్ విలువ 380 బిలియన్ డాలర్లకు చేరినట్లు అంచనా.**




ఓపెన్‌ఏఐ (OpenAI) నుంచి బయటకు వచ్చిన కొందరు పరిశోధకులు 2021లో ఆంథ్రోపిక్ ఏఐని స్థాపించారు. క్లాడ్ (Claude) బ్రాండ్ కింద కొత్త ఏఐ మోడళ్లను అందుబాటులోకి తీసుకొస్తున్నారు. సొంతగా కోడ్ రాయడం, సాఫ్ట్‌వేర్‌లో లోపాలను పరిష్కరించడం, డేటా అనాలసిస్‌తో పాటు కఠినమైన టాస్క్‌లను కూడా పూర్తిచేసే సామర్థ్యమున్నట్లు చెబుతోన్న సంస్థ.. ఐటీ సర్వీస్ ప్రొవైడర్లకు సవాల్ విసురుతోంది. అయినప్పటికీ ఈ ఏఐ టూల్స్ వల్ల వేగంగా పని జరగడంతోపాటు ఖర్చులు తక్కువయ్యే అవకాశం ఉండడంతో అనేక కంపెనీలు ఇందులో పెట్టుబడులు పెడుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవల సిరీస్ జీ నుంచి 30 బి.డాలర్లు పెట్టుబడులు సేకరించడంతో సంస్థ విలువ 380 బిలియన్ డాలర్లకు పెరిగినట్లు ఆంథ్రోపిక్ ఓ ప్రకటనలో పేర్కొంది. మూడేళ్ల క్రితం ఒక డాలర్‌తో మొదలైన ఆదాయం ప్రస్తుతం 14 బిలియన్ డాలర్లకు పెరిగిందని తెలిపింది.

## ఏఐకి టీసీఎస్ భయపడదు: సీఈఓ కృతివాసన్



కృత్రిమ మేధ (Artificial Intelligence) సాంకేతికతకు దిగ్గజ ఐటీ సంస్థ టీసీఎస్ (TCS) భయపడదని ఆ సంస్థ సీఈఓ కృతివాసన్ పేర్కొన్నారు. ఏఐ వల్ల సంభవించే మార్పులకు అనుగుణంగా కంపెనీ విధానాలు మార్చుకుంటున్నామని అన్నారు. సంస్థ వార్షిక ఈవెంట్‌లో మాట్లాడిన ఆయన.. ఏఐ టూల్స్ వినియోగంతో స్వీయ ఆదాయం తగ్గినా ఫర్వాలేదన్నారు. వీటిని ఉపయోగించాలని సిబ్బందిని ప్రోత్సహిస్తున్నామని చెప్పారు.

ఏఐ ఆధారిత సాంకేతికత వినియోగంలో యువ నిపుణులతో పోలిస్తే సీనియర్ స్థాయి ఉద్యోగులు నెమ్మదిగా ఉన్నట్లు గుర్తించామని కృతివాసన్ పేర్కొన్నారు. తమ ఆరు లక్షల సిబ్బందిలో ఏఐ నైపుణ్యాలు ఉండాలని భావిస్తున్నామన్న ఆయన.. ఉద్యోగులు కూడా కష్టపడాల్సిన అవసరం ఉందన్నారు. ఉపాధి అవకాశాలను నూతన సాంకేతికత దెబ్బతీస్తుందనే విషయంపై సంస్థ భయపడదన్నారు.

## మరోసారి ట్రంప్ టార్గెట్‌లో భారత్..
## ఆ దిగుమతులపై 126 శాతం డ్యూటీ..!



**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి భారత్‌ను టార్గెట్ చేశారు. మన దగ్గరి నుంచి అమెరికాకు దిగుమతి అయ్యే సోలార్ ఉత్పత్తులపై (Solar Imports) ప్రాథమికంగా 126 శాతం డ్యూటీ విధించారు. ఇండోనేసియాపై ప్రాథమిక సుంకాలను 86 శాతం నుంచి 143 శాతానికి పెంచారు. లావోస్‌పై 81 శాతం డ్యూటీ వేశారు. ఫారెన్ సబ్సిడీల ఆధారంగా రేటును నిర్ధరించినట్లు అమెరికా వాణిజ్య శాఖ వెల్లడించింది.**

ఈ మూడు దేశాల నుంచి అగ్రరాజ్యానికి దిగుమతి అవుతోన్న సెల్స్, ప్యానెల్స్ వంటి సోలార్ దిగుమతుల విలువ 4.5 బిలియన్ డాలర్లని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. తమ సోలార్ ఉత్పత్తులపై ఈ దేశ ప్రభుత్వాలు అసంబద్ధ రీతిలో సబ్సిడీలు ఇస్తున్నాయని ట్రంప్ (Donald Trump) ప్రభుత్వం వాదిస్తోంది. అమెరికా ఫస్ట్ విధానానికి ట్రంప్ తొలి ప్రాధాన్యం ఇస్తున్నారు. స్థానిక తయారీని ప్రోత్సహించడానికి తాపత్రయపడుతున్నారు. ఈ అధిక డ్యూటీ కారణంగా అమెరికా వినియోగదారులు సోలార్ దిగుమతులపై ఎక్కువ చెల్లించాల్సి ఉంటుంది. ఇదిలాఉంటే.. ప్రపంచ దేశాలపై ఇప్పటికే ట్రంప్ ఎడాపెడా విధించిన సుంకాలను అమెరికా సుప్రీంకోర్టు రద్దు చేసిన సంగతి తెలిసిందే. ఇలాంటి సమయంలో ఈ డ్యూటీ విధింపు ప్రాధాన్యం సంతరించుకుంది.

## దేశంలో ఐటీ ఉద్యోగుల సంఖ్య @59.50 లక్షలు

**అంతర్జాతీయ అనిశ్చితులు, ఏఐ ప్లాట్‌ఫామ్‌ల రాకతో మార్పులు.. వీటన్నిటి మధ్య కూడా భారత టెక్ రంగం రాణిస్తోంది. 2025-26లో ఈ రంగ ఆదాయం 6.1% వృద్ధితో 315 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.28.35 లక్షల కోట్ల)కు చేరొచ్చని పరిశ్రమ సంఘం నాస్కామ్ అంచనా వేస్తోంది.**



**ఏఐ నైపుణ్యం.. 20 లక్షల మందికి**

202425లో ఐటీ రంగంలో నికరంగా 1.33 లక్షల ప్రత్యక్ష ఉద్యోగాలు జత చేరగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ సంఖ్య 1.35 లక్షలకు పెరిగింది. దేశంలోని మొత్తం ఐటీరంగంలోని ప్రత్యక్ష ఉద్యోగుల సంఖ్య 58.15 లక్షల నుంచి 59.50 లక్షలకు చేరుకున్నట్లు నాస్కామ్ తెలిపింది. కొత్త ఉద్యోగాల్లో నికర వృద్ధి 2,000 ఉద్యోగాలే. గత కొన్నేళ్లలో ఇది అత్యంత మందగమన స్థితి.

ఉద్యోగ వృద్ధి 2.3%, ఆదాయ వృద్ధి 6.1% నమోదు కావడంపై నాస్కామ్ ప్రెసిడెంట్ రాజేశ్ నంబియార్ స్పందిస్తూ, ప్రస్తుత పరిస్థితుల్లోనూ ఐటీ ఉద్యోగుల సంఖ్య నికరంగా పెరగడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. భవిష్యత్తులో నియామకాలు పెరుగుతాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు. మొత్తం 59.5 లక్షల మంది ఐటీ ఉద్యోగుల్లో 20 లక్షల మంది ఏఐ (కృత్రిమమేధ) సాంకేతికతలో నైపుణ్యం సాధిస్తున్నారని, ఇందులో 3 లక్షల మంది అధునాతన ఏఐ స్కిల్స్ నేర్చుకుంటున్నారనీ వివరించారు.

అమెరికాను మించి.. 202526లో మొత్తం మీద దేశీయ సంస్థలకు ఏఐ ఆదాయాలు 1012 బిలియన్ డాలర్ల (సుమారు రూ.90,000 1,08,000 కోట్లు) మేర ఉండొచ్చని నాస్కామ్ అంచనా వేసింది. అన్ని కంపెనీలూ ఏఐ ఆదాయాలను వెల్లడించలేదన్నారు. సాధారణంగా అమెరికా నుంచి మన కంపెనీలకు అధిక వృద్ధి లభిస్తుంటుందని, అయితే ఈసారి ఆసియా పసిఫిక్, మధ్య ప్రాచ్య ప్రాంతాలు వేగవంతమైన వృద్ధిని నమోదుచేశాయని నంబియార్ పేర్కొన్నారు. దేశీయంగా ఐటీ కంపెనీలకు ఆదాయం 202526లో 7.9% వృద్ధి చెందింది. ఇది ప్రపంచ స్థాయి సగటు కంటే అధికం. రంగాల వారీగా చూస్తే ఆరోగ్య సంరక్షణ, పర్యాటక, రవాణా రంగాల్లో అధిక వృద్ధి కనిపిస్తోంది.

**ఏఐతో ఐటీకి ఇబ్బందులే**

కృత్రిమ మేధ (ఏఐ)తో జరిగే మార్పుల వల్ల ఐటీ రంగంలో 'ఇబ్బందికర' పరిణామాలు ఎదురుకావొచ్చని హెచ్‌సీఎల్ టెక్ ఎండీ, సీఈఓ సి. విజయ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. అయితే ఐటీ రంగానికి 'సంస్మరణ' సమయం ఏమీ రాలేదని, సంక్లిష్ట ఎంటర్‌ప్రైజెస్ టెక్నాలజీ ఆర్కిటెక్చర్‌ను నిర్వహించగలిగే సామర్థ్యం వల్ల నిలదొక్కుకోగలదని అన్నారు. వై2కే తర్వాత పరిశ్రమ ఎలాగైతే మార్పులు స్వీకరించి ముందుకెళ్లిందో.. అలాగే ఇప్పుడు కూడా తనకు తాను పునర్ నిర్వచించుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఐటీ రంగం గొప్ప మలుపు తీసుకునే సమయం ఇదని, వచ్చే 510 ఏళ్లలో ఈ రంగం పూర్తిగా మారొచ్చని అన్నారు.

## అనిల్ అంబానీ నివాసం అటాచ్ చేసిన ఈడీ



రిలయన్స్ గ్రూప్ ఛైర్మన్ అనిల్ అంబానీ (Anil Ambani)కి చెందిన ముంబయి నివాసం 'అబోడ్'ను ఈడీ అధికారులు అటాచ్ చేశారు. మనీలాండరింగ్ నిరోధక చట్టం (PMLA) కింద ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. 17 అంతస్తులతో 66 మీటర్ల ఎత్తున్న ఈ విలాసవంతమైన ఇల్లు.. ముంబయిలోని పాలి హిల్ ప్రాంతంలో ఉంది. దీని విలువ సుమారు రూ.3,716 కోట్లు ఉంటుందని అంచనా. అనిల్ గ్రూప్ కంపెనీలు కోట్ల రూపాయల బ్యాంకు రుణాల మోసానికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. రిలయన్స్ కమ్యూనికేషన్స్ (RCOM)తో సంబంధం ఉన్న కేసులో భాగంగా ఆ ఇంటిని ఈడీ అటాచ్ చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. దీంతో ఈ కేసులో ఇప్పటివరకు అటాచ్ చేసిన ఆస్తుల విలువ దాదాపు రూ.15,700 కోట్లకు చేరుకుంది. మరోవైపు.. ఈ నెల 26న విచారణకు హాజరు కావాల్సిందిగా అనిల్ అంబానీకి ఈడీ (Enforcement Directorate) సమన్లు జారీ చేసింది. 2025 ఆగస్టులో ఒకసారి ఆయన ఈడీ విచారణకు హాజరయ్యారు. ముందస్తు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లనని ఇటీవల సుప్రీం కోర్టుకు తెలిపారు.



మోషన్ క్యాప్చర్ టెక్నాలజీతో 'వారణాసి' షూట్..

## ఇండియన్ సినీ మేకింగ్‌లో మైల్‌స్టోన్!

తెలుగు సినీ ఇండస్ట్రీలో సాంకేతికత కొత్త పుంతలు తొక్కడానికి సిద్ధమైంది. ఇప్పటికే పాన్‌ఇండియా సినిమాలతో దూసుకెళ్తున్న తెలుగు సినీ పరిశ్రమలో టెక్నాలజీపరంగా సరికొత్త అడుగుపడింది. 'అవతార్' సహా ఎన్నో హాలీవుడ్ సినిమాలను మోషన్ క్యాప్చర్ టెక్నాలజీ సాయంతో తీస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటివరకూ తెలుగు మేకర్స్ ఈ సాంకేతికత కోసం ఇతర దేశాలపై ఆధారపడాల్సి వచ్చేది. ఇప్పుడు హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో ఈ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింది. ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి ఎంఅండ్ఎం క్యాప్ ల్యాబ్‌ను బుధవారం ఆవిష్కరించారు. మహేశ్‌బాబు (Mahesh Babu) కథానాయకుడిగా రూపొందిస్తున్న 'వారణాసి'లోని కీలక సన్నివేశాలను అక్కడ తీసినట్లు తెలిపారు. అన్నపూర్ణా స్టూడియోస్, శోభు యార్లగడ్డ మిహిరా విజువల్ ల్యాబ్స్, హాలీవుడ్ కంపెనీ యానిమాట్రిక్ ఫిల్మ్ డిజైన్ సంయుక్తంగా ఈ సాంకేతికతను అందుబాటులోకి తెచ్చాయి.

గతంలో అన్నపూర్ణ స్టూడియోస్‌లోనే ఏర్పాటు చేసిన 'డాల్బీ సినిమా ప్రాసెస్' సౌకర్యాన్ని రాజమౌళి ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మోషన్ క్యాప్చర్ టెక్నాలజీ స్టూడియో కూడా ఆయన చేతుల మీదుగానే ప్రారంభమైంది. ఈ సందర్భంగా జక్కన్న మాట్లాడుతూ.. "అంతర్జాతీయ సినీ నిర్మాణ సంస్థలకు భారత్ నుంచే అత్యుత్తమ సాంకేతిక నిపుణులు వెళ్తున్నారు. అయితే, ఆ అధునాతన సౌకర్యాలు మాత్రం మనకు ఉండటం లేదు. 'బాహుబలి', 'ఈగ' వంటి సినిమాలు తీస్తున్నప్పుడు మనకు గనుక మోషన్ క్యాప్చర్ టెక్నాలజీ సౌకర్య ఉంటే ఇంకా ఉత్తమంగా ఎలా చేయొచ్చా? అనుకునేవాడిని. ఇప్పుడు ఇది మనకు అందుబాటులోకి వచ్చింది. ఇండియన్ ఫిల్మ్‌మేకర్స్ ఆలోచనాధోరణి అత్యుత్తమ స్థాయికి తీసుకెళ్లవచ్చు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న మోషన్ క్యాప్చర్ టెక్నాలజీ స్టూడియోలను నేను సందర్శించా. ఏ అండ్ ఎం అద్భుతంగా టెక్నాలజీని అందిస్తోంది. ఇప్పటికే 'వారణాసి' కోసం ఈ సౌకర్యాన్ని వినియోగించుకుని కీలక సన్నివేశాలను తీశా. అవి అద్భుతంగా వచ్చాయి" అని రాజమౌళి అన్నారు. భారతీయ సినీ ప్రయాణంలో ఇదొక మైలురాయి అని కథానాయకుడు నాగార్జున (Nagarjuna) అభివర్ణించారు. రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న 'వారణాసి' వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ప్రేక్షకుల ముందుకు రానుంది.



# అవకాశాలు ఉన్నప్పుడే మేల్కోవాలి..

## లేకపోతే ఏమీ మిగలదు: తమన్నా

**మార్గాలను వెతుక్కోవాలన్న తమన్నా**
**లేకపోతే కెరీర్ చివరి దశలో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు తప్పవని హెచ్చరిక**
**తాను రియల్ ఎస్టేట్, జ్యువెలరీ వంటి రంగాల్లో పెట్టుబడులు పెట్టానని వెల్లడి**

గ్లామర్ ప్రపంచంలో వెలుగులు ఉన్నప్పుడే భవిష్యత్తు గురించి ఆలోచించాలని టాలీవుడ్ మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా కీలక వ్యాఖ్యలు చేశారు. చిత్ర పరిశ్రమలో అవకాశాలు వరుస కడుతున్న సమయంలోనే ఇతర ఆదాయ మార్గాలను వెతుక్కోవాలని, లేనిపక్షంలో కెరీర్ చివరి దశలో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆమె హెచ్చరించారు. కేవలం 15 ఏళ్ల ప్రాయంలోనే వెండితెరకు పరిచయమై, గత 21 ఏళ్లుగా అగ్ర హీరోల సరసన నటిస్తూ తనదైన ముద్ర వేసిన తమన్నా, తాజాగా ఒక ఇంటర్వ్యూలో తన ఆర్థిక క్రమశిక్షణ వెనుక ఉన్న రహస్యాలను పంచుకున్నారు.

తమ కెరీర్ ఆరంభం నుండి తండ్రి అందించిన మార్గనిర్దేశమే తనను ఈ స్థాయిలో నిలబెట్టిందని తమన్నా పేర్కొన్నారు. "నేను ఇండస్ట్రీకి వచ్చిన కొత్తలో నా ఆర్థిక వ్యవహారాలన్నీ మా నాన్నే చూసుకునేవారు. ఆయన నేర్పిన క్రమశిక్షణ వల్లే ఈరోజు నేను రియల్ ఎస్టేట్, జ్యువెలరీ బిజినెస్ వంటి రంగాల్లో పెట్టుబడులు పెట్టగలిగాను. నటీనటులకు దూరదృష్టి చాలా అవసరం. చేతి నిండా పని ఉన్నప్పుడే సంపాదనను సరైన మార్గాల్లో మళ్లించాలి. లేదంటే చివరకు ఏమీ మిగలదు" అంటూ ఆమె కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు.



ప్రస్తుతం నటనతో పాటు సొంతంగా నగల వ్యాపారాన్ని కూడా నిర్వహిస్తున్న తమన్నా, తన తండ్రి నేర్పిన ఆర్థిక ప్రణాళికలే తన భవిష్యత్తుకు భరోసా అని స్పష్టం చేశారు.

ఇక సినిమాల పరంగా చూస్తే, ఈ ఏడాది తమన్నా భారీ ప్రాజెక్టులతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. సిద్ధార్థ్ మల్హోత్రాతో కలిసి ఆమె నటించిన 'వివాన్: ఫోర్స్ ఆఫ్ ది ఫారెస్ట్' చిత్రం మే 15న విడుదలకు సిద్ధంగా ఉంది. దీనితో పాటు అజయ్ దేవగణ్, సంజయ్ దత్ వంటి స్టార్ హీరోలు నటిస్తున్న 'రేంజర్' చిత్రంలో కూడా తమన్నా ఒక కీలక పాత్రలో మెరవనున్నట్లు సమాచారం.

## ఉస్తాద్' బిజినెస్.. ఆంధ్రా రైట్స్ కు 70 కోట్ల డిమాండ్, 60 కోట్ల ఆఫర్!

- "ఉస్తాద్ భగత్ సింగ్ ఆంధ్ర హక్కులపై ఉత్కంఠ
- రూ.70 కోట్లు డిమాండ్ చేస్తున్న నిర్మాతలు
- రూ.60 కోట్లకు కొనేందుకు ముందుకొస్తున్న బయ్యర్లు
- పవన్-హరీష్ శంకర్ కాంబోపై భారీ అంచనాలు
- మొత్తం మీద రూ.155 కోట్ల థియేట్రికల్ బిజినెస్ అంచనా

పవర్ స్టార్ పవన్ కల్యాణ్, దర్శకుడు హరీష్ శంకర్ కాంబినేషన్‌లో రాబోతున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా ప్రీరిలీజ్ బిజినెస్ ట్రేడ్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ముఖ్యంగా, ఆంధ్ర ప్రాంత థియేట్రికల్ హక్కుల విషయంలో నిర్మాతలు మరియు డిస్ట్రిబ్యూటర్ల మధ్య ఆసక్తికరమైన చర్చలు జరుగుతున్నాయి. నిర్మాతలు ఈ హక్కుల కోసం ఏకంగా రూ.70 కోట్లు డిమాండ్ చేస్తుండగా, బయ్యర్లు మాత్రం రూ.60 కోట్ల వరకు ఇచ్చేందుకే మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. గతంలో పవన్‌హరీష్ శంకర్ కాంబినేషన్‌లో వచ్చిన 'గబ్బర్ సింగ్' బ్లాక్‌బస్టర్ విజయం సాధించడంతో, 'ఉస్తాద్ భగత్ సింగ్' పైనా భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ క్రేజ్‌ను దృష్టిలో ఉంచుకునే నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ స్థాయిలో ధరను కోట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే, ప్రస్తుత మార్కెట్ పరిస్థితులను అంచనా వేస్తున్న డిస్ట్రిబ్యూటర్లు మాత్రం కొంత వెనకడుగు వేస్తున్నట్లు వార్తలు వినబడుతున్నాయి.

మరోవైపు, ఈ సినిమా మొత్తం థియేట్రికల్ బిజినెస్ అన్ని ప్రాంతాలు కలిపి దాదాపు రూ.155 కోట్లకు చేరువయ్యే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ చిత్రంలో పవన్ సరసన శ్రీలీల, రాశీ ఖన్నా నటిస్తుండగా, దేవిశ్రీ ప్రసాద్ సంగీతం సమకూరుస్తున్నారు. మార్చి 26, 2026న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమా ఆంధ్ర హక్కుల డీల్ త్వరలోనే ఖరారయ్యే అవకాశం ఉంది.



## తిరుమలలో 15 నిమిషాల పాటు దర్శనం.. తప్పుగా అర్థం చేసుకున్నారు: శివానీ నాగరం



**వరుస సినిమాలతో విజయాలను తన ఖాతాలో వేసుకున్న నటి శివానీ నాగరం. ఇటీవల 'హే బలవంత్'తోనూ అలరించింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆమె పంచుకున్న విషయాలు సోషల్‌మీడియాలో వివాదమయ్యాయి. తిరుమలలో 15 నిమిషాల పాటు స్వామి దర్శనభాగ్యం దక్కిందని పేర్కొన్నారు. 'భక్తులకు తిరుమల శ్రీవారి దర్శనం నాలుగైదు సెకన్లు దొరకడమే కష్టమనుకుంటే ఈమె ఇలా చెబుతున్నారేంటి', 'సెలబ్రిటీ అయితే చాలు, దగ్గరుండి మరీ దర్శనం చేయించి తీసుకొస్తారు', 'ఇంతకీ ఈమె చేసిన సినిమాలేంటి? ఇలా నెటిజన్లు వరుసగా ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు' ఈ క్రమంలో శివానీ స్పందించారు. శ్రీవాణి టికెట్ కొనుగోలు చేసి శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నట్లు తెలిపారు. అంతేకాదు, 15 నిమిషాల సమయంపైనా స్పష్టత ఇచ్చారు.**

**"ఇటీవల ఓ యూట్యూబ్ ఛానల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చాను. ఈ సందర్భంగా యాంకర్ కొన్ని ప్రశ్నలు అడిగారు. చిన్నప్పటి జ్ఞాపకాలు, కెరీర్, సక్సెస్, ఆధ్యాత్మిక ప్రయాణం ఇలా ఒక్కో అంశాన్ని అడిగారు. ఇందులో భాగంగా నా ఆధ్యాత్మిక ప్రయాణాన్ని పంచుకున్నా. రామకోటి రాయడం, కేదార్‌నాథ్ దర్శనం, శిర్డీ విషయాలను పంచుకునే క్రమంలో 'తిరుమలలో స్వామివారిని 15 నిమిషాల పాటు దర్శనం చేసుకున్నా' అనే మాట హైలైట్ అవుతోంది. అంతేకాదు, సోషల్‌మీడియాలో తప్పుగా వెళ్తోంది. అక్టోబరు నెలలో తిరుపతి విమానాశ్రయంలో నేను, మా అమ్మ లైనులో నిలబడి శ్రీవాణి టికెట్స్ తీసుకున్నాం. తర్వాత దర్శనం చేసుకున్నాం"**

**"క్యూలైన్‌లోకి వచ్చినప్పటి నుంచి స్వామి దగ్గరకు వెళ్లేంతవరకూ కొంచెం కొంచెం స్వామివారు కనిపిస్తుంటారు. ఆ సమయం మొత్తం 15 నిమిషాలు ఉంటుందని అంచనాతో అలా చెప్పాను. అంతేకానీ, స్వామివారి ముందు నిలబడి 15 నిమిషాల పాటు ఎవరూ టచ్ చేయలేదు అని కాదు. అంతకుముందు కూడా రూ.300 టికెట్ తీసుకుని, కుటుంబంతో వెళ్లాను. అప్పుడు కేవలం నాలుగైదు సెకన్లే చూశాను. 13ఏళ్ల తర్వాత స్వామి వారిని దగ్గరగా చూశానన్న భావనతో అలా చెప్పాను. మీలో ఎవరైనా సరే శ్రీవాణి టికెట్ తీసుకుంటే కచ్చితంగా స్వామి వారిని దగ్గరి నుంచి చూడొచ్చు. దీనిపై స్పష్టత ఇవ్వాలనే ఉద్దేశంతోనే ఈ విషయం చెబుతున్నా" అని వివరణ ఇచ్చారు.**

## తప్పించుకోవడం కోసమే అలా చేస్తాను : హీరో శ్రీవిష్ణు



**శ్రీవిష్ణు మంచి అందగాడు .. హ్యాండ్సమ్ హీరో అనే చెప్పాలి. అయితే పూర్తిస్థాయి హాస్య ప్రధానమైన కథలను .. పాత్రలను ఎంచుకుంటూనే ఆయన ముందుకు వెళుతున్నాడు. అలా ఆయన చేసిన సినిమానే 'విష్ణు విన్యాసం'. ఈ కథలో కామెడీ టచ్ ఏ స్థాయిలో ఉంటుందనేది ఈ టైటిల్ చెబుతూనే ఉంది. సుమంత్ నాయుడు నిర్మించిన ఈ సినిమాకి, యదునాథ్ మారుతీరావు దర్శకత్వం వహించాడు. ఈ నెల 27వ తేదీన థియేటర్లకు ఈ సినిమా రానుంది.**

**ఈ సినిమా ప్రమోషన్స్ లో భాగంగా శ్రీవిష్ణు 'గ్రేట్ ఆంధ్ర'తో మాట్లాడుతూ, 'ఒంగోలు' నేపథ్యంలో ఈ కథ నడుస్తుంది. హీరో మిడిల్ క్లాస్ యువకుడు .. జూనియర్ లెక్చరర్ ఆ పనిచేస్తూ ఉంటాడు. లవ్ అంటూ ఒక అమ్మాయి అతని వెంటపడుతూ ఉంటుంది. అతనికి న్యూమరాలజీపై నమ్మకం ఎక్కువ. అలాంటి హీరో ఎలాంటి చిక్కుల్లో పడతాడు? ఆ చిక్కుల్లో నుంచి ఎలా బయటపడతాడు? అనేదిమిగతా కథ" అని చెప్పాడు.**

**"ఏ సినిమా చేస్తున్నా నేను నిర్మాత గురించి తప్పకుండా ఆలోచిస్తాను. సాధ్యమైనంత వరకూ బడ్జెట్ దాటకుండా చూసుకుంటాను. అసరమైతే పారితోషికం తగ్గించుకోవడానికి కూడా వెనుకాడను. కథ నాకు బాగా నచ్చితే పారితోషికం లేకుండా చేసిన సినిమాలు కూడా ఉన్నాయి. పారితోషికం కారణంగా నేను ఏ సినిమా వదులుకోలేదు. కథ నచ్చనప్పుడు .. ప్రాజెక్టు చేయడం ఇష్టం లేనప్పుడు పారితోషికం విషయాన్ని గట్టిగా పట్టుకుంటాను అంతే" అని చెప్పాడు.**

## వెడ్డింగ్ ఆఫ్ విరోష్.. ప్రధాని నుంచి విషెస్

**విజయ్ దేవరకొండ, రష్మిక మరికొన్ని గంటల్లో వివాహబంధంతో ఒక్కటి కానున్నారు. ఈ జంటకు భారత ప్రధాని మోదీ కార్యాలయం నుంచి శుభాకాంక్షలు అందాయి. విజయ్ దేవరకొండ తల్లిదండ్రులు పంపిన వివాహ ఆహ్వాన పత్రికకు స్పందించిన మోదీ.. వారికి విషెస్ తెలుపుతూ లేఖ పంపారు (Wedding of virosh).**

"సప్తపది స్ఫూర్తితో ఏడడుగులు వేస్తోన్న ఈ జంట జీవితాంతం స్నేహితులుగా ఉండాలని కోరుకుంటున్నా. రానున్న కాలమంతా కలిసిమెలిసి ఉండాలని ఆకాంక్షిస్తున్నా" అని దీవించారు. ఈ సందర్భంగా వారి కుటుంబాలకు కూడా మోదీ (Narendra Modi) శుభాకాంక్షలు తెలిపారు. ప్రస్తుతం ఈ లెటర్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 'గీత గోవిందం', 'డియర్ కామ్రేడ్' సినిమాల్లో నటించి ప్రేక్షకుల్ని అలరించిన ఈ జంట ఈనెల 26న కలిసి ఏడడుగులు వేయనుంది. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ వివాహానికి వేదిక కానుంది. హైదరాబాద్‌లో మార్చి 4న వివాహ విందు వేడుకని నిర్వహించనున్నారు.



## డిఫరెంట్ లుక్‌లో శర్వానంద్.. 'భోగి' రిలీజ్ ఎప్పుడంటే!



**శర్వానంద్ (Sharwanand) హీరోగా సంపత్ నంది దర్శకత్వంలో 'భోగి' సినిమా రూపొందుతోన్న విషయం తెలిసిందే. ఈరోజు ఈ సినిమా విడుదల తేదీతో పాటు ఫస్ట్‌లుక్‌ను (Bhogi FirstLook) రిలీజ్ చేశారు. శర్వానంద్ డిఫరెంట్‌లుక్‌లో ఆకట్టుకుంటున్నారు. ఈ చిత్రం ఆగస్టు 28న విడుదల కానున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. 1960 నేపథ్యంలో సాగే కథతో ఇది రానుంది. శర్వాకు జోడీగా అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయాతి నటిస్తున్నారు.**

**ఉత్తర తెలంగాణ - మహారాష్ట్ర ప్రాంతాలతో ముడిపడిన ఈ పీరియాడిక్ కథని పాన్ ఇండియా స్థాయిలో తెర పైకి తీసుకొస్తున్నారు. ఇప్పటికే పలు షెడ్యూళ్లు పూర్తి చేసుకుంది. ఇటీవల విడుదల చేసిన దీని కాన్సెప్ట్ వీడియోకు ఆదరణ సొంతమైంది. "భారీ హంగులతో రూపొందుతున్న చిత్రమిది. దర్శకుడి విజన్‌కి ప్రాణం పోయడం కోసం ప్రొడక్షన్ బృందం 20 ఎకరాల్లో, ఆరు నెలల పాటు శ్రమించి సెట్‌ని తీర్చిదిద్దింది. శర్వానంద్ ఇదివరకెప్పుడూ చేయని ఓ విభిన్నమైన పాత్రని ఇందులో పోషిస్తున్నార"ని గతంలో చిత్రబృందం తెలిపింది.**

## విజయ్ రష్మిక పెళ్లి రేపే.. ఈనాటి కార్యక్రమాల వివరాలు ఇవిగో!

దక్షిణాది చిత్ర పరిశ్రమలో ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న క్షణం రానే వచ్చింది. టాలీవుడ్ సెన్సేషనల్ స్టార్ విజయ్ దేవరకొండ, నేషనల్ క్రష్ రష్మిక మందన్నల వివాహ వేడుకలు రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రకృతి ఒడిలో, చారిత్రక కట్టడాల మధ్య జరుగుతున్న ఈ వేడుకలకు సంబంధించిన విశేషాలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, ఈ మధ్యాహ్నం 12 గంటల తర్వాత కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల మధ్య 'హల్దీ' (పసుపు) వేడుక అట్టహాసంగా జరగనుంది. ఇక సాయంత్రం 7 నుండి 8 గంటల సమయంలో రంగురంగుల కాంతుల మధ్య 'మెహందీ' వేడుకను ప్లాన్ చేశారు. ఇప్పటికే నిన్న రాత్రి జరిగిన 'సంగీత్' వేడుకలో విజయ్, రష్మిక తమ



డ్యాన్స్‌లతో అతిథులను ఉర్రూతలూగించినట్లు తెలుస్తోంది. సంప్రదాయబద్ధంగా సాగే వేడుకలకు కాస్త భిన్నంగా, ఈ జంట తమ పెళ్లి వేడుకల్లో సరదా ఆటపాటలకు పెద్దపీట వేశారు. ముఖ్యంగా కుటుంబ సభ్యులు, స్నేహితుల కోసం ప్రత్యేకంగా "విరోష్ ప్రీమియర్ లీగ్" పేరుతో ఒక ప్రైవేట్ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈ వేడుక కోసం వారిద్దరి పేర్లు, పెళ్లి తేదీ చెక్కిన ఒక చిన్న క్రికెట్ బ్యాట్‌ను కూడా ప్రత్యేకంగా తయారు చేయించడం విశేషం. దీనికి సంబంధించిన ఫొటోలను రష్మిక తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో పంచుకోవడంతో అభిమానులు ఖుషీ అవుతున్నారు.

ఈ జంట రేపు మూడు ముళ్ల బంధంతో ఒకటి కాబోతోంది. సినీ రంగానికి చెందిన పలువురు ప్రముఖులు ఇప్పటికే ఉదయ్‌పూర్ చేరుకోగా, రేపు జరగబోయే ప్రధాన వివాహ ఘట్టం కోసం అభిమానులు వేయి కళ్లతో వేచి చూస్తున్నారు. విజయ్, రష్మికల జంటకు సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

## సూర్య విషయంలో అలా చేస్తే మూర్ఖత్వమే: మైకెల్ వాన్



టీ20 ప్రపంచ కప్‌లో సూపర్ 8 దశ కొనసాగుతోంది. ఇప్పటికే టీమ్‌ఇండియా తన తొలి సూపర్8 మ్యాచ్‌లో ఓటమి చవిచూసింది. గురువారం జింబాబ్వేతో తలపడేందుకు చెన్నై వేదికగా తీవ్ర సాధన చేస్తోంది. కెప్టెన్ సూర్య కుమార్ యాదవ్ అద్భుతమైన ఫామ్‌తో లీగ్ స్టేజ్‌లో పరుగులు రాబట్టాడు. మరోసారి అతడి నుంచి భారీ ఇన్నింగ్స్ రావాలని అభిమానులు కోరుకుంటున్నారు. అయితే, ఈ టీ20 ప్రపంచ కప్ ముగిసిన తర్వాత సూర్యకుమార్‌ను కెప్టెన్సీ నుంచి తప్పిస్తారనే ఊహాగానాలు వస్తున్నాయి. కొత్త సారథ్యం వైపు టీమ్‌ఇండియా మేనేజ్‌మెంట్ చూస్తోందన్న వ్యాఖ్యలు వినిపించాయి. ఈ క్రమంలో ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ మైకెల్ వాన్ కీలక వ్యాఖ్యలు చేశాడు. సూర్య విషయంలో అలాంటి నిర్ణయం తీసుకోవద్దని సూచించాడు. ''సూర్యకుమార్ యాదవ్ ఓ అద్భుతం. ఇలాంటి జీనియస్ ప్లేయర్‌ను కొనసాగించాలి. టీ20 ప్రపంచ కప్ తర్వాత 'స్కై'ను కాదని మరొక సారథిని తీసుకురావాలనుకోవడం మూర్ఖత్వమే అవుతుంది'' అని అన్నాడు.

**తిలక్ స్ట్రైక్‌రేట్‌పై..**

''తిలక్ వర్మ స్ట్రైక్‌రేట్‌ను పెంచుకోవాలని చూస్తుంటాడు. అయితే, బ్యాటింగ్ లైనప్‌ను ఓ సారి గమనిస్తే.. విభిన్నమైన కూర్పుతో బరిలోకి దిగుతుంటాం. అందులోనూ నిలకడైన ఆటతీరు ప్రదర్శించడం చాలా ముఖ్యం. కొన్నిసార్లు నిలకడగా ఆడే సమయంలో స్ట్రైక్‌రేట్ మరీ ఎక్కువగా ఉండకపోవచ్చు. కొన్నిసార్లు 130140 స్ట్రైక్‌రేట్‌తో పరుగులు చేయడం వల్ల పునాది వేయగలుగుతాడు. ఇదంతా బ్యాటింగ్ లైనప్‌నుబట్టి ఆధారపడి ఉంటుంది'' అని పేర్కొన్నాడు.

**అతడు వన్డే ప్లేయర్..**

''ఈ ప్రపంచ కప్పే పాకిస్థాన్ క్రికెటర్ బాబర్ అజామ్‌కు చివరి టీ20 టోర్నీ. బాబర్ అజామ్‌ను నేను పొట్టి ఫార్మాట్ ప్లేయర్ అనుకోవడం లేదు. అతడికి వన్డే ఫార్మాట్ చక్కగా నప్పుతుంది. టెస్టుల్లోనూ స్పెషలిస్ట్‌గా మారొచ్చు'' అని మైకెల్ వాన్ విశ్లేషించాడు.

## నన్ను లేదా నా కుమారుడిని దూషిస్తే పాకిస్థాన్‌కు కప్ రాదు: కెప్టెన్ సల్మాన్ అఘా భార్య




తనను లేదా నా కుమారుడిని అసభ్యపదజాలంతో దూషించినంత మాత్రాన పాకిస్థాన్‌కు కప్ రాదని ఆ జట్టు కెప్టెన్ సల్మాన్ అఘా భార్య అన్నది. టీ20 ప్రపంచకప్ సూపర్ 8లో ఇంగ్లాండ్ చేతిలో పాకిస్థాన్ పరాజయం పాలైంది. మరొక మ్యాచ్ వర్షం కారణంగా రద్దైంది. దీంతో సెమీస్ అవకాశాలు చాలా సంక్లిష్టంగా మారాయి. జట్టు ఆటతీరుపై పాక్ అభిమానులు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. బ్యాటింగ్‌లో సల్మాన్ అఘా విఫలమయ్యాడు . దీంతో అభిమానులు సల్మాన్ అఘాతో పాటు అతడి కుటుంబాన్ని కూడా లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తున్నారు. వారి విమర్శలపై ఆవేదన చెందిన పాక్ కెప్టెన్ భార్య సబ్బా మన్జెర్ తమను లక్ష్యంగా చేసుకుంటే ఫలితం ఉండదని అభిమానులను ఉద్దేశించి పోస్టు పెట్టింది.

ఒక మ్యాచ్‌లో ఓడిపోయి, మరో మ్యాచ్ వర్షార్పణం కావడం వల్ల పాకిస్థాన్ ఖాతాలో ఒక పాయింట్ ఉంది. ప్రస్తుతం న్యూజిలాండ్ కూడా 1 పాయింటుతో ఉంది. ఈరోజు కొలంబో వేదికగా శ్రీలంకతో జరగనున్న మ్యాచ్‌లో న్యూజిలాండ్ గెలిస్తే ఆ జట్టు ఖాతాలో 3 పాయింట్లు ఉంటాయి. అప్పుడు పాక్ సెమీస్ అవకాశాలు దాదాపు ముగిసినట్లే.

ఒకవేళ శ్రీలంక చేతిలో కివీస్ ఓడిపోయినా పాక్‌కు ఇబ్బందులు తప్పవు. సూపర్ 8లో తన చివరి మ్యాచ్‌ను శ్రీలంకతో తలపడనుంది. మ్యాచ్ వర్షం కారణంగా రద్దైనా ఇంటి ముఖం పట్టాల్సిందే. ఈరోజు న్యూజిలాండ్‌పై శ్రీలంక గెలిచి, తర్వాత మ్యాచ్‌లో పాకిస్థాన్ చేతిలో ఓడిపోతే నెట్ రన్ రేట్ కీలకం కానుంది. న్యూజిలాండ్ తన చివరి మ్యాచ్‌లో ఇంగ్లాండ్ జట్టుతో ఓడిపోతేనే శ్రీలంక లేదా పాకిస్థాన్‌కు అవకాశం ఉంటుంది.

## టీమిండియాకు గుడ్ న్యూస్.. తిరిగి జట్టుతో చేరనున్న రింకూ సింగ్



టీ20 ప్రపంచకప్ 2026లో కీలకమైన సూపర్ 8 దశలో ఉన్న భారత జట్టుకు ఊరట లభించింది. తండ్రి అనారోగ్యం కారణంగా జట్టును వీడిన స్టార్ బ్యాటర్ రింకూ సింగ్ తిరిగి టీమ్‌తో కలవనున్నాడు. జింబాబ్వేతో జరగనున్న మ్యాచ్‌కు ముందు అతను అందుబాటులో ఉంటాడని టీమిండియా బ్యాటింగ్ కోచ్ సితాన్షు కొటక్ తెలిపారు.

తండ్రి ఆరోగ్యం క్షీణించడంతో రింకూ సింగ్ మంగళవారం సాయంత్రం చెన్నైలోని భారత జట్టు క్యాంప్ నుంచి ఇంటికి బయలుదేరి వెళ్లాడు. అయితే, రేపు జింబాబ్వేతో మ్యాచ్ జరగనున్న నేపథ్యంలో బుధవారం సాయంత్రానికే రింకూ తిరిగి జట్టుతో చేరతాడని కొటక్ మీడియా సమావేశంలో స్పష్టం చేశారు. ఈ టోర్నమెంట్‌లో ఇప్పటివరకు జరిగిన అన్ని మ్యాచ్‌లలోనూ రింకూ సింగ్ ఆడాడు.

విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం రింకూ తండ్రి స్టేజ్ 4 లివర్ క్యాన్సర్‌తో బాధపడుతున్నారని, ప్రస్తుతం ఆయన వెంటిలేటర్ సపోర్ట్‌పై ఉన్నారని తెలుస్తోంది.

ఈ విషయంపై కొటక్ మాట్లాడుతూ.. "రింకూ తండ్రికి ఆరోగ్యం బాగాలేదు. అందుకే అతను వెనక్కి వెళ్లాడు. ఈరోజు సాయంత్రం అతను తిరిగి జట్టులోకి వస్తాడని భావిస్తున్నాం" అని తెలిపారు. రింకూ తిరిగి రావడంతో జింబాబ్వేతో మ్యాచ్‌కు భారత బ్యాటింగ్ లైనప్ మరింత పటిష్ఠం కానుంది.

# శ్రీలంక అవుట్.. సూపర్ 8లో కివీస్ ఘన విజయం




టీ20 ప్రపంచ కప్‌లో సెమీస్ అవకాశాలను న్యూజిలాండ్ మెరుగుపర్చుకుంది. కొలంబో వేదికగా శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో కివీస్ 61 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 168 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో శ్రీలంక 107/8 స్కోరుకే పరిమితమైంది. కమిందు మెండిస్ (31), దునిత్ వెల్లలాగె (29) మాత్రమే రాణించారు. వారితోపాటు కుశాల్ మెండిస్ (11), పవన్ రత్నాయకె (10) మినహా.. మరెవరూ రెండంకెల స్కోరు చేయలేదు. రచిన్ రవీంద్ర (4/27) దెబ్బకు శ్రీలంక బ్యాటింగ్ ఆర్డర్ కుదేలైంది. టీ20 ప్రపంచ కప్‌లో సెంచరీ హీరో నిశాంక (0) డకౌట్‌గా పెవిలియన్‌కు చేరాడు. చరిత్ అసలంక (5), దాసున్ శనక (3), దుషాన్ హేమంత (3) విఫలమయ్యారు. రచిన్‌తోపాటు మ్యాట్ హెన్రీ 2.. సాంట్నర్, ఫిలిప్స్ చెరో వికెట్ తీశారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా రచిన్ రవీంద్ర నిలిచాడు.

**సాంట్నర్-కోలే కీలక భాగస్వామ్యం**

తొలి 12 ఓవర్ల ఆట చూశాక.. న్యూజిలాండ్ స్కోరు 160+ వస్తుందని ఎవరూ ఊహించి ఉండరు. ఎందుకంటే 84 పరుగులకే ఆరు వికెట్లను కోల్పోయిన ఆ జట్టును కెప్టెన్ సాంట్నర్ (47), కోలె మెక్‌కాంచి (31*) ఆదుకొన్నారు. వీరిద్దరూ ఏడో వికెట్‌కు 84 పరుగులు జోడించారు. రచిన్ రవీంద్ర (32), ఫిన్ అలెన్ (23), గ్లెన్ ఫిలిప్స్ (18) ఫర్వాలేదనిపించారు. టిమ్ సీఫెర్ట్ (8), డారిల్ మిచెల్ (3), మార్క్ చాప్‌మన్ (0) నిరాశపరిచారు. శ్రీలంక బౌలర్లలో చమీర 3, తీక్షణ 3, వెల్లలాగె ఒక వికెట్ తీశారు.

**శ్రీలంక నిష్క్రమణ..**

వరుసగా రెండు మ్యాచుల్లోనూ ఓటమితో శ్రీలంక టీ20 ప్రపంచ కప్ సెమీస్ రేసు నుంచి నిష్క్రమించింది. న్యూజిలాండ్ (3 పాయింట్లు), పాకిస్థాన్ (1 పాయింట్) మధ్యే గ్రూప్2 నుంచి రెండో సెమీస్ బెర్తు కోసం పోటీ ఉంది. పాకిస్థాన్ తన చివరి మ్యాచ్‌ను శ్రీలంకతో ఫిబ్రవరి 28న, ఇంగ్లాండ్‌తో న్యూజిలాండ్ ఫిబ్రవరి 27న తలపడనున్నాయి. ఒకవేళ ఇంగ్లాండ్‌పై కివీస్ గెలిస్తే.. పాక్ ఇంటిముఖం పట్టినట్టే. అలా కాకుండా కివీస్ ఓడితే మాత్రం పాక్‌కు కాస్త అవకాశాలు ఉంటాయి. అప్పుడు శ్రీలంకపై మెరుగైన నెట్‌రన్‌రేట్‌తో గెలవాల్సి ఉంటుంది.

## నెట్‌రన్‌రేట్ కంటే.. విజయానికే తొలి ప్రాధాన్యం: ఇర్ఫాన్




టీ20 ప్రపంచ కప్‌లో జింబాబ్వేతో భారత్ సూపర్8 మ్యాచ్‌లో తలపడనుంది. ఇందులో విజయం సాధిస్తే.. విండీస్‌తో జరిగే మ్యాచ్ అత్యంత కీలకం కానుంది. అందులో గెలిస్తే సెమీస్ బెర్తు దాదాపు ఖాయం కానుంది. అందుకే, నెట్‌రన్ రేట్ కంటే విజయాలపైనే దృష్టి పెట్టాలని టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్ సూచించాడు.

'మ్యాచ్ ప్రారంభం సమయంలో నెట్‌రన్ రేట్ గురించి ఆలోచిస్తారని అనుకోవడం లేదు. మొదట మ్యాచ్‌లో విజయం సాధించడమే ప్రాధాన్యం. మంచి ప్రదర్శన ఇచ్చి గెలిస్తే చాలు. ఆ తర్వాతే రన్‌రేట్ గురించి ఆలోచించాలి. అలా కాకుండా నెట్ రన్‌రేట్ గురించి ఆలోచిస్తూ ఉంటే మ్యాచ్ ఫలితంపైనా ప్రభావం పడే అవకాశం లేకపోలేదు. జింబాబ్వేతో మ్యాచ్ అనంతరం విండీస్‌తో తలపడాల్సి ఉంది. టీ20ల్లో ప్రతిసారి 100కిపైగా పరుగుల తేడాతో గెలవడం తేలికైన విషయం కాదు. అందుకే, రెండు మ్యాచుల్లోనూ విజయం సాధిస్తే ఆటోమేటిక్‌గా మనం సెమీస్‌కు చేరుకొనే అవకాశాలు మెరుగ్గా ఉంటాయి. ఇప్పుడు నెట్ రన్‌రేట్‌లో విండీస్, దక్షిణాఫ్రికా చాలా దూరంలో ఉన్నాయి. నెట్ రన్‌రేట్‌ను రికవరీ చేయడం కాస్త కష్టమే. అందుకే, మిగతా రెండు మ్యాచుల్లోనూ గెలిస్తే సరిపోతుందని భావిస్తున్నా'' అని పఠాన్ వెల్లడించాడు.

**సూర్య మూడో స్థానంలో..**

''కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ మూడో స్థానంలో బ్యాటింగ్ చేస్తే బాగుండేది. అయితే, గత మ్యాచ్ ప్రకారం చూస్తే.. అభిషేక్, ఇషాన్ త్వరగా ఔట్ కావడంతో సూర్య వెంటనే బ్యాటింగ్‌కు రావాల్సి వచ్చింది. అతడు మిడిల్ ఓవర్లలో చాలా ప్రభావం చూపిస్తాడు. కనీసం 160 స్ట్రైక్‌రేట్‌తో పరుగులు రాబడతాడు. ఒకవేళ కొత్త బంతితో ఒక మంచి డెలివరీతో ఔటయ్యే ప్రమాదమూ లేకపోలేదు. అందుకే, అతడిని ఆపడం వెనుక పరిస్థితిని నేను అర్థం చేసుకోగలను'' అని పఠాన్ విశ్లేషించాడు.

## పాక్ ఓటమి.. లైవ్ టీవీలో ఫైర్ అయిన షోయబ్ అక్తర్!



టీ20 ప్రపంచకప్ సూపర్ 8లో ఇంగ్లండ్ చేతిలో పాకిస్థాన్ జట్టు ఘోర పరాజయం పాలవ్వడంతో ఆ దేశ మాజీ ఫాస్ట్ బౌలర్ షోయబ్ అక్తర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. నిన్న జరిగిన ఈ మ్యాచ్‌లో ఓటమితో పాక్ సెమీ ఫైనల్ అవకాశాలు సంక్లిష్టంగా మారాయి. ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఒక లైవ్ టీవీ షోలో మాట్లాడిన అక్తర్, జట్టు కెప్టెన్ సల్మాన్ అలీ ఆఘా నాయకత్వ పటిమను ప్రశ్నిస్తూ తీవ్ర విమర్శలు చేశాడు.

పల్లెకెలె వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌కు ముందు 'గేమ్ ఆన్ హై' అనే టీవీ షోలో అక్తర్ మాట్లాడుతూ.. "ఇంగ్లండ్ చెత్తగా ఆడి మనం రెండు పాయింట్లు సాధిస్తే బాగుంటుందని ఆశిస్తున్నా. ఒకవేళ భారత్ టోర్నీ నుంచి నిష్క్రమించి, మనం సెమీస్‌కు వెళ్తే మా ఆనందానికి అవధులే ఉండవు" అని అన్నాడు. అయితే, మ్యాచ్‌లో పాకిస్థాన్ ఘోరంగా ఓడిపోవడంతో ఆయన తీవ్ర అసహనానికి గురయ్యాడు.

మ్యాచ్ అనంతరం జరిగిన చర్చలో కెప్టెన్ సల్మాన్ అలీ ఆఘా నాయకత్వానికి అర్హుడు కాదంటూ అక్తర్ వ్యాఖ్యానించాడు. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) సల్మాన్ అలీని కెప్టెన్‌గా నియమించినప్పుడు, ఆ నిర్ణయాన్ని స్వాగతించిన తొలి వ్యక్తులలో అక్తర్ ఒకరు కావడం గమనార్హం. ఇప్పుడు ఆయనే కెప్టెన్‌ను విమర్శిస్తూ మాట మార్చడం చర్చనీయాంశంగా మారింది.

## ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్.. అగ్రస్థానంలో అభిషేక్.. టాప్-5లోకి ఇషాన్

**ఐసీసీ తాజాగా విడుదల చేసిన పురుషుల టీ20 ప్లేయర్ ర్యాంకింగ్స్‌లో భారత ఆటగాళ్లు సత్తా చాటారు. టీమిండియా ఓపెనర్ అభిషేక్ శర్మ తన నంబర్ వన్ ర్యాంకును పదిలంగా నిలబెట్టుకోగా, వికెట్ కీపర్-బ్యాటర్ ఇషాన్ కిషన్ తొలిసారి టాప్-5లోకి దూసుకొచ్చాడు.**




టీ20 ప్రపంచకప్‌లో ఇప్పటివరకు పెద్దగా రాణించకపోయినా, అభిషేక్ శర్మ బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలోనే కొనసాగుతున్నాడు. రెండో స్థానంలో ఉన్న ఇంగ్లండ్ ఆటగాడు ఫిల్ సాల్ట్‌పై 62 పాయింట్ల ఆధిక్యాన్ని కాపాడుకున్నాడు. ఇదే జాబితాలో ఇషాన్ కిషన్ మూడు స్థానాలు ఎగబాకి ఐదో ర్యాంకుకు చేరుకోవడం విశేషం. టోర్నీలో అత్యధిక పరుగులు చేసిన పాకిస్థాన్ ఓపెనర్ సాహిబ్జాదా ఫర్హాన్ రెండు స్థానాలు మెరుగుపరుచుకుని మూడో ర్యాంకును అందుకున్నాడు.ఆల్‌రౌండర్ల జాబితాలో జింబాబ్వే కెప్టెన్ సికందర్ రజా మళ్లీ అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నాడు. భారత ఆల్‌రౌండర్ శివమ్ దూబె రెండు స్థానాలు మెరుగుపరుచుకుని ఏడో ర్యాంకుకు చేరాడు. బౌలింగ్ విభాగంలోనూ భారత ఆధిపత్యం కనిపించింది. స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి తన నంబర్ వన్ ర్యాంకును నిలబెట్టుకున్నాడు. భారత స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా కూడా తన ర్యాంకును మెరుగుపరుచుకుని ఎనిమిదో స్థానానికి చేరుకున్నాడు. మరోవైపు దక్షిణాఫ్రికా పేసర్ కార్బిన్ బాష్ ఏకంగా 21 స్థానాలు ఎగబాకి మూడో ర్యాంకులో నిలవడం అందరినీ ఆశ్చర్యపరిచింది.